




www.aksharamtelugudaily.com

RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

MONDAY 8TH SEPTEMBER 2025 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 08 ISSUE : 163 COST : 3\- KHAMMAM, TELANGANA

సోమవారం 8 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 163 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


### గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సక్సెస్ ఫుల్‌గా

# నిర్వహించాం

హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్



# బీసీ ఓటు బ్యాంకుపై దృష్టి..!




**హైదరాబాద్ :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బీసీ వర్గాల మద్దతు పొందేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మక చర్యలు చేపడుతోంది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 15న కామారెడ్డిలో "బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభను" ఘనంగా నిర్వహించనుంది. ఈ సభ ద్వారానే ఎన్నికల ప్రచారానికి శుభారంభం చేయాలని కాంగ్రెస్ యోచిస్తోంది.

**జాతీయ నేతల హాజరుతో ప్రతిష్ఠాత్మక సభ**

ఈ విజయోత్సవ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. లక్ష మందికి

### పార్టీ మారిన ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్

# కీలక సమావేశం



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అత్యవసర భేటీ అయ్యారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసుల జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏం చేయాలనే అంశంపై సీఎం చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు.
ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో భాగంగా బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. అయితే.. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ.. పలు సందర్భాల్లో ప్రకటించారు. శాసనసభ రికార్డుల్లోనూ పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారు.

# చంద్ర గ్రహణం ఎఫెక్ట్..

### ఆలయాలు మూసివేత..



**హైదరాబాద్:**
సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా ఇవాళ(ఆదివారం) తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన పలు దేవాలయాలను మూసివేశారు. ఈ రోజు రాత్రి 9.58 గంటల నుంచి చంద్రగ్రహణం ప్రారంభం కానుంది. రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి 12.22 గంటల దాకా సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడనుంది. ఈ 82 నిమిషాలపాటు చంద్రుడు పూర్తిగా భూమి నీడన ఉండనున్నాడు. తిరిగి రేపు(సోమవారం) తెల్లవారుజామున 2.25 గంటలకు గ్రహణం వీడనుంది. ఈ నేపథ్యంలో పలు ప్రముఖ ఆలయాలు మూతపడ్డాయి. గ్రహణం వీడిన తర్వాత ఆలయాలను తెరిచి సంప్రోక్షణ

# తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు

**హైదరాబాద్ :**
తెలంగాణ లేటెస్ట్ వెదర్ అప్ డేట్ వచ్చేసింది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావం క్రమంగా పెరుగుతుండడంతో.. రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం తుఫాన్ బలహీనంగా ఉన్నప్పటికీ.. సోమవారం నుంచి దాని ప్రభావం పెరుగుతుందని.. మంగళ, బుధ వారాల్లో.. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, బలమైన గాలులు ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది.



### కవిత లిక్కర్ రాణిగా జిల్లాకు

# చెడ్డపేరు తెచ్చారు..

### టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



# బీజేపీ ఎంపీల వర్క్ షాప్..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 07:**
ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం జరగనుంది. ఆ క్రమంలో భారతీయ జనతా పార్టీ.. తన ఎంపీలతో రెండు రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహిస్తోంది. ఈ వర్క్ షాష్ ఆదివారం న్యూఢిల్లీలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ వర్క్ షాప్‌లో ప్రధాని నరేంద్ర మోదీ.. ఇతర సభ్యులతో కలిసి చివరి వరుసలో కూర్చున్నారు. అందుకు సంబంధించిన ఫొటో వైరల్ అవుతోంది.



# ఖాళీగా 10వేల టీచర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో సుమారు 10 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత నెల 26వ తేదీ వరకు జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతుల వల్ల 4,500 పోస్టులు ఖాళీ కాగా, ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా 6 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందారు. ఈ రెండు కారణాలతో మొత్తం ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య 10 వేలకు పైగా ఉంటుందని అంచనా.



# ఖాళీగా 10వేల టీచర్ పోస్టులు

పదోన్నతులు, పదవీ విరమణలు

ఉపాధ్యాయుల పదోన్నతులపై ఉన్న స్టేను హైకోర్టు ఆగస్టు 20న ఎత్తివేయడంతో, పదోన్నతుల ప్రక్రియ తిరిగి ప్రారంభమై ఆగస్టు 26లోపు పూర్తయింది. ఈ ప్రక్రియలో మొత్తం 4,454 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. వారిలో 880 మంది గ్రేడ్–2 గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా, 811 మంది ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా(%జూతీఱఅఎఱజూఖశ్రీం) (గూానవీం%), 2,763 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. మల్టీ జోన్–1లో 490 మంది, మల్టీ జోన్–2లో 390 మంది గ్రేడ్–2 గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పదోన్నతి పొందారు. ప్రతి ఏడాది రాష్ట్రంలోని 26 వేల పైగా పాఠశాలల్లో సుమారు 6 వేల మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతుంటారు. ఈ ఏడాది కూడా అంతే సంఖ్యలో ఉపాధ్యాయులు విరమించడంతో ఖాళీల సంఖ్య గణనీయంగా పెరిగింది.

నిరుద్యోగుల డిమాండ్, ప్రభుత్వ వాదన

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన టెట్ పరీక్ష ఫలితాలు కూడా విడుదల కావడంతో, కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఖాళీలను భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అయితే, ప్రభుత్వ వర్గాల ప్రకారం, రాష్ట్రంలోని 26,120 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 1.08 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు, 16.70 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ లెక్కన విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఉండాల్సిన దానికంటే ఎక్కువగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సక్సెస్ ఫుల్‌గా

# నిర్వహించాం

హైదరాబాద్, సెప్టెంబరు7 : గణేశ్ నిమజ్జన శోభాయాత్ర నిన్న(శనివారం) ఉదయం 6.30గంటలకు ప్రారంభమైందని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ (%జూ జఎ ాాఖుఅ%) పేర్కొన్నారు. ఇంకా 900 వినాయక విగ్రహాల నిమజ్జనం అవ్వాల్సి ఉందని చెప్పుకొచ్చారు. చిన్న గణేశ్ విగ్రహాలను కలుపుకొని ఈరోజు 25 వేల విగ్రహాలు నిమజ్జనం అవ్వాలని తెలిపారు. 40 గంటల పాటు నిమజ్జన శోభాయాత్ర జరిగిందని వివరించారు. 12,034 విగ్రహాలు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు. 6,300 విగ్రహాలు నిన్నటి వరకు నిమజ్జనం అయ్యాయని తెలిపారు. ఇవి కాకుండా లక్ష 20 వేల విగ్రహాలు హైదరాబాద్‌లోని బేబీ పాండ్స్, ఇతర చెరువుల్లో నిమజ్జనం అయ్యాయని పేర్కొన్నారు సీవీ ఆనంద్.

లక్షా 40 వేల గణేశ్ విగ్రహాల నిమజ్జనం..

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మొత్తం లక్షా 40 వేల గణనాథుల విగ్రహాలు నిమజ్జనం అయినట్లు జీహెచ్ఎంసీ చెబుతోందని అన్నారు. పోలీసులు రెండు రోజుల పాటు నిద్ర లేకుండా బందోబస్తు చేశారని తెలిపారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల సమన్వయంతో అనుకున్న సమయం కంటే ముందే నిమజ్జనం పూర్తి చేశామని వివరించారు. పదిరోజులుగా గణేశ్ మండపం నిర్వాహకులను ఒప్పించి ఈ ఏడాది ముందుగానే వినాయకుల విగ్రహాలను తీయించామని చెప్పుకొచ్చారు. ముందు సౌత్ జోన్ విగ్రహాలు తీయించామని వెల్లడించారు. అక్కడ సెన్సిటివ్ ప్రాంతాలు ఉన్నాయని.. లా అండ్ ఆర్డర్ సమస్యతో ముందు సౌత్ జోన్‌లో గణనాథుల విగ్రహాలను నిమజ్జనానికి తరలించామని తెలిపారు. ఆ తర్వాత మిగతా ప్రాంతాల విగ్రహాలను తీయించి నిమజ్జనం చేయించామని పేర్కొన్నారు సీవీ ఆనంద్.

సీఎం రేవంత్ సర్‌ప్రైజ్ విజిట్ మంచిదే..

'ఈసారి గణేశ్ విగ్రహాల ఎత్తు ఎక్కువగా ఉంది.. 40 ఫీట్ల కన్నా ఎత్తు ఉన్న విగ్రహాలు ఈసారి పెరిగాయి. దీంతో శోభాయాత్ర ఆలస్యమైంది. నిన్న(శనివారం) రాత్రి శోభాయాత్రలో చిన్న చిన్న గొడవలు జరిగాయి. ఐదు కేసులు నమోదు చేశాం. వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి చేసినందుకు మా పోలీసులకు అభినందనలు తెలుపుతున్నాను. ప్రణాళిక ప్రకారమే గణనాథుల నిమజ్జన శోభాయాత్ర జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి వినాయక శోభాయాత్రలో సర్‌ప్రైజ్ విజిట్ చేయడం మంచిదే. వీఐపీ విజిట్స్‌తో ఎలాంటి సమస్య లేదు. మమ్మల్ని అభినందించడం ప్రోత్సాహకంగా ఉంది. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, ఆర్టీఏ, హెచ్ఎండీఏ అధికారుల సమన్వయంతో సక్సెస్ ఫుల్‌గా నిమజ్జనం పూర్తయింది. ఖైరతాబాద్ గణేశ్ దగ్గర నిన్నటి వరకు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన 1,070 మంది ఆకతాయిలను పట్టుకున్నాం. పిక్ పాకెటింగ్ కేసులు కూడా నమోదు చేశాం. గతేడాదితో పోలిస్తే ఈసారి క్రైమ్ రేట్ తగ్గింది. ఈసారి వినాయక నిమజ్జనంలో టెక్నాలజీని ప్రత్యేకంగా వాడాం. 9 డ్రోన్లు వినియోగించాం. వీటి ద్వారా మాకు మంచి వ్యూ తెలిసింది. 35 హై రైజ్ బిల్డింగ్స్‌పైన సీసీ కెమెరాలు పెట్టి మానిటరింగ్ చేశాం' అని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## చంద్ర గ్రహణం

# ఎఫెక్ట్..

కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు మూసివేశారు. ఈ మూసివేత సోమవారం తెల్లవారుజామున 3 గంటల వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచి శుద్ధి చేసిన తర్వాత 3 గంటలకు సుప్రభాతంతో దర్శనాలు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే.. శ్రీశైలం ఆలయాన్ని మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేసి సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు తెరవనున్నారు. సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూజలు చేసిన అనంతరం ఉదయం 7.30 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

వీటితో పాటు నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్న ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఇవాళ మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేశారు. సోమవారం ఉదయం 5 గంటల వరకు ఆలయాన్ని మూసివేయనున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాన్నీ మధ్యాహ్నం 3.30 గంటల నుంచి దుర్గగుడి కవాట బంధనంతో మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి సంప్రోక్షణ, స్నపనాభిషేకం చేపట్టనున్నారు. అమ్మవారికి హారతి అనంతరం సోమవారం ఉదయం 8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్టుగా అధికారులు తెలిపారు. విశాఖపట్నంలోని సింహాచలం అప్పన్న ఆలయాన్ని కూడా ఉదయం 11:30 గంటలకు మూసివేసిన విషయం తెలిసిందే.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం రామాలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఇవాళ ఒంటి గంటకు మూసివేసినట్లు అధికారులు తెలిపారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు తెరవనున్నట్లు ప్రకటించారు. ఉదయం 7:30 గంటల నుంచి స్వామి సేవలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. వీటితో పాటు.. యాదాద్రి జిల్లాలోని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ఏలూరు జిల్లాలోని ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయాలు కూడా మూసివేయబడ్డాయి.

## కవిత లిక్కర్ రాణిగా జిల్లాకు

# చెడ్డపేరు తెచ్చారు..

కామారెడ్డి: జిల్లా కేంద్రంలో ఐదుగురు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పర్యటించారు. ఈ నెల 15న కామారెడ్డిలో బీసీ రిజర్వేషన్ కృతజ్ఞత బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రులు పరిశీలించారు. ఈ మేరకు ఇందిరాగాంధీ స్టేడియం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాలను సందర్శించారు. బీసీ డిక్లరేషన్ సభకు ఇందిరా గాంధీ స్టేడియం స్థలం సరిపోదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా డిగ్రీ కళాశాల మైదానం పరిశీలించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సభా స్థలాన్ని ఫైనల్ చేయనున్నట్లు స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్లకు అండగా ఉన్నారు..

ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాలకు కామారెడ్డిలో చాలా నష్టం వాటిల్లిందని తెలిపారు. వరద పరిశీలనకు వచ్చినప్పుడు సీఎం రేవంత్ రెడ్డితో బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ గురించి మాట్లాడినట్లు గుర్తు చేశారు. బీసీ డిక్లరేషన్ సభకు తానే బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. డిక్లరేషన్ ప్రకటించి ఏడాది పూర్తయిన రోజైన ఈనెల 15న సభ పెట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డిలోనే భారీ సభకు ప్లాన్ చేసినట్లు స్పష్టం చేశారు. అన్ని వర్గాల నాయకులు బీసీ రిజర్వేషన్లకు అండగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు.

బండి సంజయ్‌కు సవాల్..

బీసీ రిజర్వేషన్ బిల్లు చట్టం కాకుండా.. బీజేపీ నాయకులు ఆపుతున్నారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బీజేపీ నాయకులు దేవుడి పేరిట ఓట్లు అడుక్కునే బిచ్చగాళ్ళని విమర్శించారు. తామూ పూజలు చేస్తాం, గుళ్లకు వెళ్తాం.. కానీ దేవుళ్ల పేరిట ఓట్లు అడగమని ఎద్దేవా చేశారు. బీసీల రిజర్వేషన్ వచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బండి సంజయ్ నడవడి, నిర్ణయం బీసీ బిడ్డలాగా లేదని మండిపడ్డారు. తనని సెక్యూరిటీ కోసం తిరుగుతున్నానని అంటున్న బండి సంజయ్‌కు ఇద్దరం సెక్యూరిటీ వదిలేసి జనంలో తిరుగుదాం రా.. అంటూ సవాల్ విసిరారు. బీసీ బిడ్డగా రిజర్వేషన్లను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు.

కవిత లిక్కర్ రాణి..

తాము ప్రకటించిన బీసీ బిల్లుకు(చట్టంగా చేయాలనుకుంటున్న) చట్టబద్ధత చేయించండని బీజేపీ కేంద్ర మంత్రులను మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుల బాగోతం బయటపెట్టడానికే కామారెడ్డిలో భారీ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంపై శంఖారావం పూరించడానికి.. 15న సమరానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఆరా తీసే స్థాయిలో సభ జరగాలని సూచించారు. మరోవైపు జిల్లా కోడలు మాజీ ఎమ్మెల్సీ కవిత లిక్కర్ రాణిగా జిల్లాకు చెడ్డపేరు తెచ్చారని ఎద్దేవా చేశారు.

పదేళ్లుగా బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. సాక్షాత్తూ కవిత ఈ దోపిడీని బయట పెట్టారని గుర్తు చేశారు. వాటాల్లో తేడాలు రావడంతో కవిత పార్టీ నుంచి బయట పడ్డారని విమర్శించారు. కవిత తాము చేసిన దోపిడీని ఒప్పుకున్నారన్నారు. ఈ విషయం ఐదేళ్ల క్రితం చెప్పి ఉంటే సన్మానం చేసే వాళ్లమని పేర్కొన్నారు. కవిత విషయం కూడా కేసీఆర్ ఆడిస్తున్న నాటకం కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కల్వకుంట్ల కుటుంబం అంతా దొంగలే.. అని విమర్శించారు. కేసీఆర్ మళ్లీ పిలిస్తే కవిత వెళ్లదా..? అని ప్రశ్నించారు. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉండదని రెండేళ్ల కిందట చెప్పానని మహేష్ కుమార్ గౌడ్ గుర్తు చేసుకున్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ కీలక సమావేశం

ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే.. సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు లోపల పది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి స్పీకర్ నిర్ణయం ప్రకటిస్తారా..? లేక పెండింగ్‌లో పెడతారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

కొన్ని గంటలుగా.. వాడీవేడిగా సాగిన ఈ సమావేశం ముగిసినట్లు సమాచారం.ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యేలు విడివిడిగా భేటీ అయ్యినట్లు తెలుస్తోంది. అయితే.. స్పీకర్ నోటీసులకు ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు వివరణ ఇవ్వగా.. మిగతా వారు కూడా వివరణ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో గొడవలు, నేతల మధ్య విభేదాలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గ నేతల మధ్య విభేదాల పరిష్కారం భాధ్యతను పీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు అప్పగిస్తానని సీఎం రేవంత్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

## మూసీ పునరుజ్జీవన పథకంలో కీలక అడుగు

హైదరాబాద్, సెప్టెంబర్ 07: మూసీ పునరుజ్జీవన పథకంలో కీలక అడుగు పడింది. గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్ 2, 3 పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ పథకంలో భాగంగా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చెరువులను మంచినీటితో నింపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ. 7,360 కోట్లతో ఈ ప్రాజెక్టను రాష్ట్రప్రభుత్వం చేపట్టనుంది. రెండేళ్లలో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ ప్రాజెక్ట్ కోసం మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలించనున్నారు. అలాగే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు నింపడంతో పాటు మూసీ పునరుజ్జీవనానికి 2.5 టీఎంసీలు కేటాయింపులు జరపనుంది. మిగతా 17.50 టీఎంసీలు హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు వినియోగించనున్నారు. ఆ మార్గ మధ్యలోని 7 చెరువులను సైతం నింపుతారు.

డిసెంబర్ 2027 నాటికి హైదరాబాద్ తాగు నీటి అవసరాలు తీర్చేందుకు, ప్రతి రోజూ నల్లా నీటిని సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. ఇందులో ప్రభుత్వం 40 శాతం పెట్టుబడి వాటా పెడుతుండగా.. 60 శాతం నిధులను కాంట్రాక్ట్ కంపెనీ సమకూర్చనుంది.



## తెలంగాణ వ్యాప్తంగా

# భారీ వర్షాలు



హైదరాబాద్‌తో పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో గాలివానలు, ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రివేళ బయటకు వెళ్లే వారు, రైతులు, వ్యవసాయ కార్మికులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సెప్టెంబర్ 8, 9 తేదీలలో వర్షాల తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉండటంతో తక్కువ ఎత్తున్న ప్రాంతాల్లో నీరు నిలిచిపోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో వాగులు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైన వైద్య సహాయం, రక్షణ చర్యలు తక్షణం అందేలా రెస్క్యూ టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ముందస్తు చర్యలు చేపడుతోంది.

# బీజేపీ ఎంపీల వర్క్ షాప్..

ఈ వర్క్ షాప్ ప్రారంభం కాగానే.. జీఎస్టీలో సంస్కరణలు తీసుకు వచ్చిన ప్రధాని మోదీని సభ్యులు ప్రశంసలతో ముంచెత్తారు. ఇక తొలి రోజు ఈ వర్క్ షాప్‌లో 2027 నాటికి అభివృద్ధి దిశగా భారత్.., సోషల్ మీడియాను ఎంపీలు సమర్థవంతంగా వినియోగించడం.. ఈ రెండు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. అలాగే వ్యవసాయం, రక్షణ, ఇంధనం, విద్య, రైల్వేలు తదితర కమిటీలతో ఈ ఎంపీలు సమావేశం కానున్నారు. ఇక రెండో రోజు సోమవారం.. అంటే సెప్టెంబర్ 8వ తేదీన జరిగే వర్క్ షాప్‌లో ఉప రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి ఎంపీలకు శిక్షణ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు.

ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఈ పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక తేదీని ఖరారు చేసింది. దాంతో ఎన్డీయే నుంచి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరు ఖరారు చేసింది. ఇక ప్రతిపక్షం ఇండియా కూటమిలోని పార్టీలు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేశాయి. ఈ ఇద్దరు అభ్యర్థులు దక్షిణ భారతదేశానికి చెందిన వారే కావడం గమనార్హం.

సీపీ రాధాకృష్ణన్ తమిళనాడు, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి తెలంగాణకు చెందిన వారు. అయితే ఈ ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ విజయం సాధిస్తారంటూ ఇప్పటికే ఒక చర్చ అయితే బలంగా సాగుతోంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీల సంఖ్య అధికంగా ఉండడమే అందుకు కారణం. ఇక సెప్టెంబర్ 8వ తేదీన జరిగే ఈ ఎన్నికల్లో ఎలక్టోరల్ కాలేజీలోని మొత్తం 786 సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

## బీసీ ఓటు బ్యాంకుపై దృష్టి..!

పైగా జనసమీకరణ చేసి ఈ సభను చారిత్రకంగా మార్చాలని రాష్ట్ర నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఏర్పాట్లపై చర్చలు ప్రారంభం

హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నివాసంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క తదితర నేతలు సభ ఏర్పాట్లపై చర్చించారు. దీనికి కొనసాగింపుగా ఆదివారం కామారెడ్డిలో మరో కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్‌తో పాటు కరీంనగర్, మెదక్, సిద్దిపేట జిల్లాల నేతలు పాల్గొననున్నారు. అనంతరం సభ నిర్వహణ స్థలాన్ని పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు పరిశీలించనున్నారు.

బీసీ డిక్లరేషన్ నేపథ్యం

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో జరిగిన సభలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య "బీసీ డిక్లరేషన్" ప్రకటించి, అధికారంలోకి వస్తే కులగణన చేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారు. ఆ హామీకి అనుగుణంగా ప్రభుత్వం కులగణన పూర్తి చేసి, బీసీ రిజర్వేషన్లు 42%కి పెంచుతూ ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపింది. అదే వేదికపై విజయోత్సవ సభ నిర్వహించడం ద్వారా బీసీ వర్గాలకు బలమైన సందేశం పంపాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది.

## ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలకు భారత్ గట్టి జవాబివ్వాలి

న్యూఢిల్లీ: భారత్ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలకు భారత్ గట్టి జవాబివ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ట్రంప్ 50 శాతం సుంకాలకు ప్రతిగా అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై 75 శాతం సుంకాలు విధించడం ద్వారా ప్రధాని తన ధైర్యం చాటుకోవాలని అన్నారు.

ప్రధాని మంత్రి కాస్త ధైర్యం చూపించాలని మేము కోరుతున్నాం. యావద్దేశం మీకు బాసటగా నిలుస్తుంది. ఇండియా ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. మీరు అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై 75 శాతం సుంకం విధించండి. దేశం ఇందుకు సిద్ధంగా ఉంది. మీరు సుంకం విధిస్తే చాలు. అప్పుడు ట్రంప్ దిగివస్తారో లేదో చూడండి' అని కేజ్రీవాల్ ఆదివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

కాటన్‌పై నిర్ణయం తప్పు

అమెరికా కాటన్ దిగుమతులపై 2025 డిసెంబర్ 31 వరకూ 11 శాతం ఎక్సైజ్ డ్యూటీని మినహాయిస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కేజ్రీవాల్ తప్పుపట్టారు. ఈ చర్యతో స్థానిక రైతులు ప్రతికూల పరిణామాలు ఎదుర్కొంటారని, అమెరికా రైతులు సంపన్నులు అవుతారని అన్నారు. అమెరికా కాటన్ ఇక్కడకు వస్తే ఇక్కడి రైతులకు మార్కెట్‌లో రూ.900 కంటే తక్కువ వస్తుందని, అమెరికాలో రైతుల సంపన్నులు అవుతారని, గుజరాత్ రైతులు పేదలుగా మారుతారని అన్నారు. అక్టోబర్–నవంబర్ పంట సీజన్‌లో సరైన రేటుకు రైతులు మార్కెట్లో తమ ఉత్పత్తులను అమ్ముకోలేరని అన్నారు. రుణభారంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలుంటాయని హెచ్చరించారు.

కాటన్‌పై 100 శాతం టారిఫ్ విధించాలని, అప్పుడు ట్రంప్ దిగివస్తారని అన్నారు. ట్రంప్‌ను పిరికివాడని కూడా కేజ్రీవాల్ అభివర్ణించారు. అమెరికా కాటన్ దిగుమతులపై తిరిగి 11 శాతం డ్యూటీ విధించాలని డిమాండ్ చేసారు. దీనికి తోడు మన రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, రైతులకు ఆర్థిక సాయం అందించాలని అన్నారు. అమెరికా సుంకాల ప్రభావం వ్యవసాయ రంగంపైనే కాకుండా ఇండియాలోని డైమండ్ వర్కర్లపైన కూడా ఉంటుందన్నారు.



# మోడీ సవరించిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ను తిప్పికొట్టండి

## టియుసిఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం




గోదావరిఖనిలో టి యు సి ఐ పెద్దపెల్లి జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షులు తోకల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం మాట్లాడుతూ

కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోడీ ఏదేచ్ఛగా కార్మిక వ్యతిరేక విధానాలను అమల్లోకి తీసుకొస్తున్నారు. 29 కార్మిక చట్టాలను నాశనం చేసి కేవలం పారిశ్రామికవేత్తలు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ ను ఆమోదించడం జరిగింది. ఆ లేబర్ కోడ్స్ లలో పని గంటల పెంపు అన్నది కార్మిక వర్గానికి అత్యంత ప్రమాదకరంగా మారింది. వాటి ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 12 గంటల పని 282 జీవోను అమల్లోకి వచ్చింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోడీకి వ్యతిరేకంగా మాట్లాడుతూ తిరిగి మోడీ విధానాలను ఆమోదించడము సరైనది కాదు.

ఈజీ డూయింగ్ బిజినెస్ సులభతరమైన వ్యాపార విధానాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దానిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆనాటి కేసిఆర్ ప్రభుత్వం ఏదేచ్ఛగా అమలు చేయడం జరిగింది. దాని ఫలితమే పాశమైలారం శిగాచి పరిశ్రమలో 56 మంది కార్మికులు ఆహుతి అయ్యారు. సిగాచి పరిశ్రమకు ఎలాంటి ప్రమాదం లేదని ఫ్యాక్టరీ అధికారులు సర్టిఫై చేయడము సిగ్గుచేటైన విషయం. ఈ పద్ధతుల వలన కార్మిక వర్గానికి ఎలాంటి భద్రత లేని జీవితాలతో కొట్టుమిట్టాడుతున్నారు. కార్మిక వర్గానికి సామాజిక భద్రతా కింద వచ్చిన పిఎఫ్ మరియు ఈఎస్ఐ చట్టాలను యాజమాన్యాలు నిరాఘటంగా ఉల్లంఘిస్తున్నారు. యజమాన్యం యొక్క కార్మిక వ్యతిరేక విధానాలను గుడ్లప్పగించి అటు కేంద్రము ఇటు రాష్ట్రము చూస్తుంది.

సుప్రీంకోర్టు తీర్పు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో తీర్పు వచ్చింది. 9 సంవత్సరాలు గడుస్తున్న అతీగతీలేని తీర్పు. చాలీచాలని జీతాలతో జీవిస్తున్న శ్రామిక వర్గానికి సరైన వేతనాలు లేక తీవ్ర ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ జీవోలను ప్రభుత్వము ఎందుకు సవరించడం లేదని ప్రశ్నిస్తున్నాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లాలో ఎదుర్కొంటున్న కార్మిక వర్గ సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడం జరిగింది.

లిఈ సమావేశంలో పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు తోకల రమేష్ కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్ ఉపాధ్యక్షులు గొల్లపల్లి చంద్రయ్య, ఆడెపు శంకర్, మార్త రాములు గూడూరి వైకుంఠం, కలువల రాయమల్లు, పుల్లూరి నాగభూషణం, తూళ్ళ శంకర్,చిలుక రాజు, మాటేటి పోషం, మాట్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆహారం సరైనది అయితే మందులు అవసరం ఉండదు

- లయన్ డాక్టర్ శరణ్య యాదవ్

-లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోషకాహారం పై అవగాహన




**రామగిరి (పెద్దపల్లి జిల్లా) సెప్టెంబర్ 07 అక్షరం న్యూస్:**

ఆహారం సరైనది అయితే మందుల అవసరం ఉండదని లయన్స్ క్లబ్ డైరెక్టర్ డాక్టర్ శరణ్య యాదవ్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ 320జి జిల్లా గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాం ఆదేశాల మేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో ప్రకృతి వైద్య నిపుణురాలు, లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శరణ్య యాదవ్ లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి సెంటినరీ కాలనీ మార్కెట్ చౌరస్తా నందు పోస్టర్ ద్వారా పోషకాహారం గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.అనంతరం డాక్టర్ శరణ్య యాదవ్ మాట్లాడుతూ పోషకాహారం అంటే కేవలం తిండితో కడుపు నింపుకోవడం కాదు. శరీరానికి కావలసిన విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు సమపాళ్లలో ఉన్న ఆహారమే నిజమైన పోషకాహారం.ఇప్పటి తరుణంలో జంక్ ఫుడ్ అలవాట్లు పెరుగుతున్నాయి. దాంతో రక్తహీనత, డయాబెటిస్, ఊబకాయం, గుండె జబ్బులు ఎక్కువవుతున్నాయి. వీటిని నివారించడానికి మనం పండ్లు, కూరగాయలు, పాలు, మిల్లెట్స్, పప్పులు తినే అలవాటు చేసుకోవాలి. ఆహారం సరైనది అయితే మందులు అవసరం ఉండవు అన్న మాట మనం గుర్తుంచుకోవాలి.ఆరోగ్యకరమైన ఆహారం మన భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ మొల్మురి శ్రీనివాస్,డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ కళాధర్ రెడ్డి మరియు సభ్యులు అసం తిరుపతి, ఒర్రే మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఇంటి పెద్ద కొడుకుగా చిలివేరు సమ్మి గౌడ్.అనంతరం కోతి పద్మ కుటుంబానికి క్వింటా బియ్యం రూ.3000 అందజేత





**మహబూబాబాద్ /కేసముద్రం /సెప్టెంబర్ 7/అక్షరం న్యూస్:-**

కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికులు కోతి అరుణ్,సందీప్ మాతృమూర్తి కోతి పద్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి పద్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్.అనంతరం వారి కుటుంబానికి1 క్వింటా బియ్యం రూ 3,000 ఆర్థిక సహాయం గా అందజేసి వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కోతి కొమరయ్య గౌడ్ మాట్లాడుతూ మా ఇంటి కన్నె గ్రామంలోనే కాకుండా ఏ గ్రామంలోనైనా సరే గౌడ కుటుంబాలు ఆపదలో ఉంటే విషయం తెలిసిన వెంటనే సమ్మయ్య గౌడ్ సహాయం అందించడం, ప్రతి కుటుంబం లో ఒక సభ్యుడిగా ఉంటూ వారికి చేదోడు వాదోడుగా ఉంటున్న సమ్మయ్య గౌడ్ మంచితనాన్ని, ఔన్నత్యాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ పరామర్శలో సమ్మి గౌడ్ వెంట వరదెల్లి వెంకటేశ్వర్లు,పెదగాని వెంకటేశ్వర్లు,గంధసిరి వెంకటేశ్వర్లు,కోతి వెంకటరమణ,బుర్ర కుమార స్వామి,గంధసిరి శ్రీనివాస్, అంబాల మురళి,వర్దెల్లి సంపత్,మునికుంట్ల కన్నయ్య,బుర్ర ప్రభాకర్, బుర్ర శీను,కదిర సమ్మయ్య,కదిర రాజు,వర్దెల్లి రాజు,కారుపోతుల శ్రీను,బుర్ర అశోక్, బండారు నరసయ్య, బండారు యుగంధర్, గంధసిరి మల్లేష్,కోతి బాల జగన్ గౌడ్, గిరగాని శ్యామ్,కారు పోతుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకిన పల్లి గ్రామంలో వంద రేషన్ కార్డుల పంపిణీ



**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 7 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆకెనపల్లి గ్రామం లో 100 రేషన్ కార్డ్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె సుధాకర్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమం లో మంథని మహేందర్, ఐలవేణి అనసూర్య, మర్రి రాజ్ కుమార్,బరిగేలా భీమయ్య,బరిగేలా సతీష్, కనుకయ్య, రైల్లా సాగర్,ఐలవేణి నగేష్, సొల్లు పోచం, గెల్లు కొమురయ్య,శ్రీరాముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# ఎన్టీపీసీ 2024 25 ఆర్థిక సంవత్సరంలో సి ఎస్ ర్ కార్యక్రమాల కింద రూ.362.94 కోట్లు ఖర్చు





**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 7 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్**

భారతదేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ లిమిటెడ్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.362.94 కోట్లు సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాలపై ఖర్చు చేసింది. ఇది కంపెనీస్ చట్టం ప్రకారం ఖర్చు చేయాల్సిన రూ.295.29 కోట్ల కంటే ఎక్కువ. దేశ విద్యుత్ అవసరాల్లో సుమారు నాలుగో వంతు ఎన్టీపీసీ నుంచే వస్తోంది.

ఎన్టీపీసీ వార్షిక నివేదిక ప్రకారం 2024-25లో చేపట్టిన సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా దూరప్రాంత గ్రామాల్లో నివసించే 18.4 లక్షల మందికి పైగా ప్రజలు లబ్ధి పొందారు. సంస్థ తన విద్యుత్ కేంద్రాలు ఉన్న పరిసరాల్లో పేదరిక నిర్మూలన, గ్రామీణ మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, తాగునీరు, రోడ్ల నిర్మాణం వంటి అంశాలపై దృష్టి సారించింది. సమాజ అభివృద్ధి కార్యక్రమాలు ఎన్టీపీసీకి విద్యుత్ ఉత్పత్తి వ్యాపారంతో సమానంగా ఉన్నాయని చెప్పవచ్చు.

బాలికల శక్తివంతం కోసం ఎన్టీపీసీ ప్రారంభించిన “గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్” ద్వారా పది నుంచి పన్నెండు సంవత్సరాల బాలికలకు వేసవి కాలంలో నాలుగు వారాల నివాస శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా పది వేల మందికి పైగా బాలికలు లబ్ధి పొందగా, వారికి ఉచిత విద్య, వసతి, స్కాలర్‌షిప్‌లతో సహా అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. బోంగైగావ్ యూనిట్‌లో మాసిక శుభ్రత కోసం విద్యాసంస్థల్లో సానిటరీ నాప్‌కిన్ దహన యంత్రాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులలో ఆరోగ్య పరిరక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోంది. దివ్యాంగుల కోసం కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. వైకల్య పునరావాస కేంద్రాల ద్వారా ఫిజియోథెరపీ, శస్త్రచికిత్సలు, సహాయక పరికరాలు అందించి వేలాది మందికి పునరావాసం కల్పిస్తోంది. క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా ఆసుపత్రుల్లో ప్రత్యేక కేంద్రాలు, మొబైల్ యూనిట్ల ద్వారా స్క్రీనింగ్ చేసి చికిత్స అందిస్తోంది. విద్యలో వెనుకబడిన వర్గాల పిల్లలకు ఉత్కర్ష విద్యా పథకం ద్వారా పదవ తరగతి నుండి వైద్య విద్య వరకు స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. డిజిటల్ విద్యలో భాగంగా స్మార్ట్ తరగతులు, విజ్ఞానశాస్త్ర ప్రయోగశాలలు, డిజిటల్ గ్రంథాలయాలు, రోబోటిక్స్ ప్రయోగశాలలు, మొబైల్ సైన్స్ ల్యాబ్స్ ఏర్పాటు చేసింది. క్రీడలలో ముఖ్యంగా విలువిద్యకు ఎన్టీపీసీ ఇచ్చిన మద్దతుతో భారత క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో వందలాది పతకాలు సాధించారు.

విద్యా రంగంలో ఐఐటీ రూర్కీ, ఐఐటీ మద్రాస్, ఏఐఐఎంఎస్ రాయ్‌బరేలీ వంటి ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యం చేసి పరిశోధన, వసతి, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఆర్థిక మద్దతు అందిస్తోంది. అదేవిధంగా జైపూర్, జోధ్‌పూర్, కోట, బికనేర్ ప్రాంతాల్లో స్లమ్ ఏరియాలో సింగిల్ టీచర్ పాఠశాలలను మద్దతు ఇస్తూ పేద పిల్లలకు ప్రాథమిక విద్యను అందిస్తోంది.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా విస్తృత స్థాయిలో మొక్కల నాటకం, విద్యుత్ కేంద్రాలపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్, బయోమేతనేషన్ ప్లాంట్లు, పేపర్ రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. ప్రతి ప్రాజెక్ట్ ఖర్చులో 15 శాతం పర్యావరణ కాలుష్య నియంత్రణ వ్యవస్థలకు కేటాయిస్తోంది. గ్రీన్ హైడ్రజన్, పునరుత్పాదక శక్తి రంగాల్లో నాయారా ఎనర్జీ, ఆయిల్ ఇండియా లిమిటెడ్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని 2070 నాటికి భారత్ నెట్ జీరో లక్ష్యం సాధించేందుకు ముందడుగు వేస్తోంది.

అంతర్జాతీయ స్థాయిలో కూడా ఎన్టీపీసీ ప్రతిష్టను నిలబెట్టుకుంది. 2023లో ఫోర్బ్స్ ప్రకటించిన ప్రపంచంలోని ఉత్తమ ఉపాధిదాతల జాబితాలో 261వ స్థానంలో నిలిచి, ఆ జాబితాలో చోటు దక్కిన ఏకైక భారత ప్రభుత్వరంగ సంస్థగా గుర్తింపు పొందింది.

మొత్తంగా ఎన్టీపీసీ సామాజిక బాధ్యత కార్యక్రమాలు మహిళా శక్తివంతం, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు వంటి విభిన్న రంగాల్లో అమలు అవుతూ కోట్లాది ప్రజల జీవితాలను మారుస్తున్నాయి.

# ప్రధానమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం






**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) సెప్టెంబర్ 07 అక్షరం న్యూస్:**

రామగిరి మండల బిజెపి అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం సెంటినరీ కాలనీలోని బిజెపి కార్యాలయంలో పేద మధ్యతరగతి కుటుంబాలకు భారాన్ని తగ్గించే విధంగా జిఎస్టి ని సవరించినందుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యవసర వస్తువులపై పూర్తిస్థాయిలో జీఎస్టీ ని తగ్గించిన నరేంద్ర మోడీ కి మరియు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కి కృతజ్ఞతలు తెలిపారు. వీరు తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం వల్ల పేద మరియు మధ్యతరగతి కుటుంబాల యొక్క కుటుంబ భారం చాలా వరకు తగ్గుతుందన్నారు. దేశ ఆర్థిక బాగుపడాలని మోడీ జీఎస్టీ విధానాన్ని మొదలుపెట్టినప్పుడు వివిధ రాజకీయ పార్టీలు దీనిని విమర్శించారని కానీ ఈ యొక్క జీఎస్టీ విధానం వల్ల దేశ ఆర్థిక స్థితి మెరుగుపడిందన్నారు. ప్రజాపాలన అంటే ఉచితాలు ఇచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను భ్రష్టు పట్టించి ప్రజలపై భారం మోపడం కాదన్నారు. దేశం యొక్క ఆర్థిక స్థితిగతులను బట్టి సుంకలాల యొక్క ఎదుగు తగ్గుదలను నిర్ణయించడం సరైందన్నారు. ఈరోజు భారతదేశ ఒక అగ్రగామీ దేశంగా మారిందంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి యొక్క ఆలోచన విధానమేనని వివిధ దేశాల ప్రతినిధులు మోడీ గారి పాలను అభినందిస్తూ వారు కూడా మోడీ గారి యొక్క పాలన విధానాన్ని అనుసరిస్తున్నారని అన్నారు. 11 ఏళ్ల మోడీ ప్రభుత్వంలో ఒక్క స్కాం కూడా జరగలేదని కానీ స్కామ్ లకు పుట్టినిల్లు అయిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మోడీ గారిని విమర్శించడం సిగ్గుచేటు అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తొట్ల రాజు, ఉపాధ్యక్షుడు నాంసాని మహేష్, పట్టణ అధ్యక్షుడు చిదురాల శివప్రసాద్, మహిళా అధ్యక్షురాలు రొడ్డ వరలక్ష్మి, బిజెపి నాయకులు ఏం డి జానీ, గసిరెడ్డి నాగరాజు, క్రాంతి కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖిల్లాలో రిటైర్డ్ ఉద్యోగుల పర్యటన

రామగిరి(పెద్దపెల్లి జిల్లా) సెప్టెంబర్ 07 అక్షరం న్యూస్:

కరీంనగర్, మానకొండూరు ప్రాంతానికి చెందిన పలువురు రిటైర్డ్ ఉద్యోగులు ఆదివారం రామగిరి ఖిల్లాలో పర్యటించారు. రామగిరి ఖిల్లాలో పురాతన కట్టడాలను, పర్యావరణాన్ని తిలకించడానికి ఇక్కడికి రావడం జరిగింది. పర్యాటక కేంద్రంగా మార్చితే బాగుంటుందని అభిప్రాయాన్ని వారు వెలబుచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ దొంత శ్రీనివాస్, రిటైర్డ్ ఏఎస్ఐలు కొట్టే దామోదర్ రావు,తమ్మన వేణి కొమరయ్య, కుంభాల లింగయ్య,ఎస్. లక్ష్మారెడ్డి, ఎం.సత్యనారాయణ రెడ్డి, వి దామోదరచారి తదితరులు పాల్గొన్నారు.



# ఇకపై కోతులకు ఆహారం పెడితే రూ.5 వేల ఫైన్ కట్టాల్సిందే..!

డార్జిలింగ్ మున్సిపాలిటీ కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ కోతికి ఆహారం తినిపిస్తే పర్యటకుడైనా, సామాన్యుడైనా రూ.5 వేలు జరిమానా కట్టాల్సిందే. శైల్షహర్ అంతటా బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఆ రాష్ట్ర చీఫ్ ఫారెస్టర్ భాస్కర్ మాట్లాడుతూ 'కోతులకు ఆహారం ఇవ్వడం వల్ల అడవుల్లో ఆహారం సేకరించే అలవాటును మారుస్తోంది. వాటికి ఆహారం లభించకపోతే దాడి చేస్తాయి. అందుకే డార్జిలింగ్ మున్సిపాలిటీ ఈ నిర్ణయం తీసుకుంది' అని తెలిపారు.

డార్జిలింగ్ మునిసిపాలిటీ చైర్మన్ దిపెన్ ఠాకూరి ప్రకారం.. మనుషులు, కోతులకు మధ్య దాడులను నివారించడానికే ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్టుగా చెప్పారు. అంతేకాదు.. ఈ నిషేధంతో స్థానిక ప్రజలు, పర్యాటకులు అందించే ఆహారాన్ని వెతుక్కుంటూ కోతులు పట్టణానికి రాకుండా నిరోధించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇలా చేయడం వల్ల కోతులుఅడవులలో తిరుగుతూ ప్రకృతిలో లభించే పండ్లు, కాయలు వంటి సహాజ ఆహారాన్ని వెతుక్కుని తినే వాటి అసలు అలవాటుకు తిరిగి వెళ్లేలా చూడొచ్చు అన్నారు.
వాటికి ఆహారం ఇవ్వకపోతే, అవి కూడా కొరుకుతాయి. డార్జిలింగ్ అంతటా రేబిస్ సంఖ్య పెరిగింది. కాబట్టి మేం ఒక తీర్మానాన్ని ఆమోదించి దానిని తప్పనిసరి చేస్తున్నామని ఠాకూరి వెల్లడించారు. కొన్ని సంవత్సరాల క్రితం సమీపంలోని అడవి నుండి పట్టణ ప్రాంతానికి కోతులు వచ్చేవి కాదని మునిసిపాలిటీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో అప్పుడప్పుడు మాత్రమే కొన్ని కోతులు కనిపించేవని చెప్పారు





# ఫ్రెండ్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు ప్లాన్..



### ముంబై ఆత్మాహుతి దాడుల బెదిరింపు వ్యవహారంలో ట్విస్ట్..

ముంబైలో ఆత్మాహుతి దాడులతో కోటి మందిని చంపేస్తామని పోలీసులకు వచ్చిన హెచ్చరిక వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నంలో అశ్వినీకుమార్ అనే వ్యక్తి ఈ సందేశాన్ని పంపించినట్టు గుర్తించారు. అశ్వినీకుమార్‌ను ముంబై పోలీసులు అరెస్ట్ చేసి తరలించారు.ముంబైలో ఆత్మాహుతి దాడులకు పాల్పడుతామని ట్రాఫిక్ పోలీసులకు వచ్చిన వాట్సాప్ కాల్ వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. పోలీసులకు బెదిరింపు మెసేజ్‌ను పంపించిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు బీహార్‌లోని పాటలీపుత్రకు చెందిన అశ్వినీ కుమార్‌గా గుర్తించారు. అశ్వినీకుమార్‌ను నోయిడాలో అదుపులోకి తీసుకున్నారు. తన స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ బెదిరింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఫిరోజ్ అనే వ్యక్తి తనపై 2023లో కేసు పెట్టాడని, దీంతో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించినట్లు నిందితుడు తెలిపాడు. దీంతో కోపంతో రగిలిపోయిన అతడు.. దీనికి ప్రతీకారంగానే ఈ నకిలీ బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పాడు. నిందితుడి నుంచి ఏడు మొబైల్ ఫోన్స్, మూడు సిమ్ కార్డ్స్, ఆరు మెమరీ కార్డ్స్ తదితర వస్తువులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
ముంబై నగరమంతా మానవ బాంబులను మోహరించామని, 400 కిలోల ఆర్డీఎక్స్‌తో కోటి మందిని చంపేస్తారంటూ వచ్చిన వాట్సాప్ సందేశం ముంబై పోలీసులను పరుగులు పెట్టించింది. . వినాయక నిమజ్జనం వేళ ఈ బెదిరింపు మెయిల్ రావడంతో ముంబై పోలీసులు హై అలర్ట్ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ బెదిరింపులపై దర్యాప్తు చేపట్టిన అధికారులు అశ్వినీకుమార్‌ను అరెస్ట్ చేశారు.
ముంబై ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ అధికార వాట్సాప్ నంబర్‌కు శుక్రవారం ఒక బాంబు బెదిరింపు మెసేజ్ వచ్చింది. తాము పాకిస్థాన్‌కు చెందిన లష్కరే జీహాదీ గ్రూప్‌నకు చెందిన వాళ్లమని , 14 మంది ఉగ్రవాదులు నగరంలోకి ప్రవేశించారని, అనంత చతుర్దశి సందర్భంగా నగరంలోని 34 చోట్ల 34 మానవ బాంబులను మోహరించామని అందులో తెలిపారు. మానవ బాంబులతో కూడిన పలు వాహనాలను ముంబై నగరమంతా మోహరించామని, వారి వద్ద ఉన్న 400 కేజీల ఆర్డీఎక్స్‌తో కోటి మంది చనిపోతారని మెసేజ్‌లో బెదిరించారు.
వెంటనే దీనిపై అధికారులకు సమాచారం ఇవ్వడంతో క్రైమ్ బ్రాంచ్ దీనిపై దర్యాప్తు ప్రారంభించింది. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, ఇతర దర్యాప్తు సంఘాలు కూడా రంగంలోకి దిగాయి. పోలీసులు పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. తాజాగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# పిల్లలు లేరని మూడో వివాహం.. కోరిక తీరింది గానీ చివరకు ప్రాణమే పోయింది..



: పిల్లలు లేరని మూడో వివాహం..అతడికి అప్పటికే ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య వదిలేయడంతో రెండో వివాహం చేసుకున్నాడు. అయితే రెండో భార్యకు పిల్లలు లేకపోవడంతో చివరకు ఆమె చెల్లెలిని మూడో వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లకు వారికి సంతానం కలిగింది. పిల్లలు కావాలనే అతడి కోరిక అయితే తీరింది గానీ.. వారి బాగోగులు చూసుకుని మురిసిపోయే అవకాశం లేకుండా పోయింది. చివరికి మూడో భార్య చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. ఇంతకీ అసలు ఏం జరిగిందంటే..మధ్యప్రదేశ్‌భోపాల్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. అనుప్పూర్ జిల్లాలోని సకారియా గ్రామానికి చెందిన భయ్యాలాల్ రాజక్ (60) మొదటి భార్య విడిచి వెళ్లిపోయింది. దీంతో కొన్నేళ్లకు అతను గుడ్డి బాయి అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. అయితే రెండో భార్యకు పిల్లలు కలగలేదు. ఎలాగైనా వారసులు ఉండాలనే ఉద్దేశంతో భయ్యాలాల్.. మూడో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.ఈ క్రమంలో చివరకు గుడ్డి బాయి చెల్లెలు మున్నీని చేసుకోవాలని ఫిక్స్ అయ్యాడు. భార్యతో పాటూ రెండు కుటుంబాల వారూ అంగీకరించడంతో భయ్యాలాల్‌తో మున్నీ వివాహం జరిగిపోయింది. వివాహమైన కొన్నేళ్లకు మున్నీకి ఇద్దరు పిల్లలు జన్మించారు. తన కోరిక నెరవేరడంతో భయ్యాలాల్ ఎంతో సంతోషించాడు. అయితే ఆ సంతోషం ఎంతో కాలం నిలవదని గుర్తించలేకపోయాడు. ఈ క్రమంలో మున్నీకి నారాయణ్ దాస్ అలియాస్ లాలూ అనే వ్యాపారితో పరిచయం ఏర్పడింది.
ఈ పరిచయం కాస్తా కొన్నాళ్లకు వివాహేతర సంబంధానికి దారి తీసింది. మున్ని తన భర్తకు తెలీకుండా లాలూను కలుస్తుండేది. అయితే కొన్నాళ్ల తర్వాత ఆ ఇద్దరూ కలిసి భయ్యాలాల్ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో లాలూ.. ధీరజ్ కోల్ అనే వ్యక్తిని సంప్రదించాడు. చివరకు ముగ్గురూ కలిసి ఆగస్టు 30న రాత్రి భయ్యాలాల్ హత్యకు ప్లాన్ చేశారు. ఆ రోజు రాత్రి నిర్మాణంలో ఉన్న ఇంట్లో భయ్యాలాల్ పడుకుని ఉన్నాడు. వేకువజాము 2 గంటల ప్రాంతంలో లలూ, ధీరజ్ కలిసి భయ్యాలాల్‌ను ఇనుప రాడ్డుతో తలపై కొట్టి చంపేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని ఒక సంచిలో చుట్టి, రాళ్లు కట్టి బావిలో పడేశారు.
మరుసటి రోజు ఉదయం భయ్యాలాల్ రెండో భార్య గుడ్డి బాయి ఏదో పని మీద అటుగా వెళ్లి బావిలో చూడగా ఏదో తేలుతున్నట్లు కనిపించింది. భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. చివరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు అవడంతో చనిపోయాడని పోస్టుమార్టం రిపోర్టులో తేలింది. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 36 గంటల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో ముగ్గురిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కస్టడీకి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం కలిగించింది.

# దుబాయ్‌లో రూ.2500 కోట్ల డ్రగ్స్ రాకెట్ సూత్రధారి..

### హై ప్రొఫైల్ లింకులు బహిర్గతం..

దేశవ్యాప్తంగా భారీ డ్రగ్ నెట్‌వర్క్ నిర్వహిస్తున్న ముఠా లింకులకు సంబంధించిన కీలక వివరాలను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో దర్యాప్తులో గుర్తించింది. దుబాయ్ కేంద్రంగా డ్రగ్స్ దందా సాగిస్తున్న పవన్ ఠాకూర్ అనే వ్యక్తిని ప్రధాన సూత్రధారిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. నిందితుడు ఖరీదైన కార్లు, విల్లాలు కలిగి ఉన్నాడని.. విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడని ఎన్‌సిబి దర్యాప్తులో తేలింది. ఈ మేరకు అతడిపై ఇంటర్నేషనల్ సిల్వర్ నోటీస్ కూడా జారీ చేసినట్లు సమాచారం.2024 నవంబర్‌లో ఢిల్లీలో దాదాపు రూ.2,500 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడింది. ఏకంగా 82 కిలోల హై-గ్రేడ్ కొకైన్ స్మగ్లింగ్ చేస్తూ నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. దేశంలోనే ఈ స్థాయిలో మాదకద్రవ్యాల పట్టివేత జరగడం ఇదే తొలిసారి. ఈ కేసులో పవన్ ఠాకూర్ అనే నిందితుడు ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.
నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తెలిపిన వివరాల ప్రకారం, సరుకును ట్రక్కులో దేశ రాజధానికి తరలించిన తర్వాత పంపిణీ కోసం గిడ్డంగిలో నిల్వ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పవన్ ఠాకూర్ దుబాయ్ కేంద్రంగా డ్రగ్స్ దందాను నడిపిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో నిందితుడ్ని పట్టుకునేందుకు ఎన్‌సిబి అధికారులు ఇంటర్నేషనల్ సిల్వర్ నోటీస్ జారీ చేశారు.
దర్యాప్తు అధికారులు తెలిపిన ప్రకారం, మొదట ఢిల్లీలో హవాలా ఏజెంట్‌గా ప్రస్థానం మొదలుపెట్టి క్రమంగా పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల అక్రమ రవాణాలోకి దిగాడు. ఇతడు భారతదేశం, దుబాయ్‌లలో డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నాడు. మాదకద్రవ్యాల సరఫరా ద్వారా వచ్చే నల్లధనాన్ని హవాలా మార్గం ద్వారా మళ్లిస్తుంటాడు. భారతదేశం, చైనా, సింగపూర్, హాంకాంగ్, %ఖూజు%లలో క్రిప్టోకరెన్సీ ద్వారా నిందితుడు చేసి లావాదేవీలు, క్రాస్-బోర్డర్ షెల్ కంపెనీల ద్వారా చేసిన కార్యకలపాలకు సంబంధించిన ఆధారాలు సేకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇతడికి ఇప్పటికే పలుమార్లు ఈడీ సమన్లు జారీ చేసినప్పటికీ అధికారుల ముందు హాజరు కాలేదు. దీంతో ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు పవన్ ఠాకుర్ పై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఇక, 2024 నవంబరులో ఢిల్లీలో కొకైన్ స్వాధీనం చేసుకున్న కొద్దికాలానికే పవన్ కుటుంబంతో సహా ఇండియా నుండి పారిపోయి దుబాయ్‌లో స్థిరపడ్డాడు. అక్కడ నుంచే స్మగ్లింగ్, మనీలాండరింగ్ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం.



# నోట్లో యాసిడ్ పోస్తా..

### బీజేపీ నేతపై రెచ్చిపోయిన టీఎంసీ ఎమ్మెల్యే



కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అబ్దుర్ రహీమ్ బక్షి మరోసారి రెచ్చిపోయారు. బీజేపీ సిలిగురి శాసనసభ్యుడు శంకర్ ఘోష్‌ను లక్ష్యంగా చేసుకుని 'నోట్లో యాసిడ్ పోస్తా' అంటూ బెదిరించారు. ఆయన వ్యాఖ్యలు బెంగాల్ రాజకీయాల్లో ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. బెంగాల్ మాట్లాడే వలస కార్మికులపై ఇతర రాష్ట్రాలలో దాడులు జరుగుతున్నాయంటూ శనివారంనాడు మాల్దాలో టీఎంసీ నిరసన ర్యాలీ జరిపింది. ఇందులో బక్షి ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.
బెంగాల్ వలస కార్మికులను రోహింగ్యాలు, బంగ్లాదేశీయులుగా గతంలో మాట్లాడిన బీజేపీ నేతలపై బక్షి విరుచుకుపడ్డారు. శంకర్ ఘోష్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే.. 'మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు విన్నానంటే నీ నోట్లో యాసిడ్ పోసి గొంతును కాల్చేస్తా. నీకు తెలుసు, ఇది బెంగాల్. బెంగాలీలుగా నిన్ను మాట్లాడేందుకు మేము అనుమతించేది లేదు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ జెండాలు చించివేయాలని, పార్టీని సామాజిక బహిష్కరణ చేయాలని తన మద్దతుదారులను కోరారు. హింసాత్మక బెదిరింపులకు పాల్పడడం బక్షికి కొత్త కాదు. గతంలో ఆయన బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్ కార్యకర్తల కాళ్లు, చేతులు నరికేస్తామంటూ హెచ్చరికలు చేశారు.

మండిపడిన బీజేపీ
బక్షి వ్యాఖ్యలపై శంకర్ ఘోష్ ఘాటుగా స్పందించారు. 'ఆయన ఎమ్మెల్యే కాదు, మారువేషంలో ఉన్న క్రిమినల్. రాష్ట్రాన్ని మమతా బెనర్జీ ఏవిధంగా నడుతున్నారో ఆయన వ్యాఖ్యలే చెబుతున్నాయి. విపక్షాలపై యాసిడ్ దాడులు జరుపుతామని బెదిరిస్తూ పాలన సాగిస్తున్నారు' అని అన్నారు. బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము మాట్లాడుతూ, హింసాత్మక సంస్కృతిని టీఎంసీ వ్యాప్తి చేస్తోందని, రాజకీయ నిరాశలో కూరుకుపోయినందునే బక్షి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని తప్పుపట్టారు. బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో టీఎంసీపై విమర్శలు గుప్పించారు. హింస అనేది టీఎంసీకి కొత్త కాదని, అది వారి రాజకీయ సంస్కృతి అని, ముఖ్యంగా మాల్దా-ముర్షిదాబాద్‌లో ఉండే అక్రమ బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు మమతాబెనర్జీ ఓటు బ్యాంకు అని వ్యాఖ్యానించారు.

# మెట్రో స్టేషన్‌లోకి అతిపెద్ద అరుదైన బల్లి..

### హడలిపోయిన ప్రయాణికులు




ఢిల్లీలోని యమునా నది వరద మానవులకే కాకుండా జంతువులకు కూడా ఇబ్బందిగా మారింది. వరదల తరువాత యమునా చుట్టూ నివసించే ప్రజలు తమ ఇళ్లను వదిలి సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. అదే సమయంలో అడవి జంతువులు కూడా తమ బొరియలను వదిలి వెళ్ళవలసి వచ్చింది. ఈ సమయంలో ఒక పెద్ద బల్లి పొడి ప్రదేశాన్ని వెతుకుతూ మయూర్ విహార్ మెట్రో స్టేషన్‌కు చేరుకుంది. దీనిని చూసిన ప్రయాణికులు ఒక్కసారిగా భయపడిపోయారు. మెట్రో స్టేషన్ సిబ్బంది వెంటనే వన్యప్రాణుల బృందానికి సమాచారం అందించారు. ఆ తర్వాత బల్లిని రక్షించారు.మయూర్ విహార్-1 మెట్రో స్టేషన్‌లోకి వచ్చిన అరుదైన ఆఫ్రికా బల్లి ఇది అని వన్యప్రాణి బృందం తెలిపింది. మయూర్ విహార్-1 మెట్రో స్టేషన్ పాంట్రీ ప్రాంతంలో బల్లి ఉన్నట్లు సమాచారం అందిందని వైల్డ్ లైఫ్ సహ వ్యవస్థాపకుడు, కార్తీక్ సత్యనారాయణ తెలిపారు. సమాచారం అందుకున్న తర్వాత బృందం సంఘటనా స్థలానికి చేరుకుని దానిని రక్షించింది. బల్లిని సురక్షితంగా బయటకు తీశారు. దాని సహజ ఆవాసాలలోకి తిరిగి వదలనున్నారు.

# 17 ఏళ్ల బాలుడితో ఏకాంతంగా వివాహిత..

### సడెన్‌గా ఇంట్లోకి వచ్చిన బాలిక.. తర్వాత ఏం జరిగిందంటే?

తమ వివాహేతర సంబంధం బయటపెడుతుందనే అనుమానంతో ఒక వివాహిత, తన ప్రియుడైన 17 ఏళ్ల బాలుడితో కలిసి ఆరేళ్ల బాలికను హత్య చేసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో వెలుగు చూసింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 30 ఏళ్ల వివాహిత మహిళకు స్థానికంగా నివాసం ఉంటున్న 17 ఏళ్ల యువకుతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా కొన్ని రోజులకు ప్రేమగా మారి.. అది కాస్తా వివాహేతర సంబందానికి దారి తీసింది.
ఈ క్రమంలో సెప్టెంబర్ 4న భర్తతో పాటు అత్త బయటకు వెళ్లడంతో.. ఇదే అదునుగా భావించిన వివాహిత.. తన ప్రియుడైన 17 ఏళ్ల యువకుడ్ని తన ఇంటికి పిలిపించుకుంది. అయితే ఇద్దరూ సాన్నిహిత్యంగా ఉన్నప్పుడు సడెన్‌గా ఇంట్లోకి.. పక్కనే ఉండే ఒక ఆరేళ్ల బాలిక వచ్చింది. అది గమనించిన ఇద్దరూ ఈ విషయం వెవరికీ చెప్పొద్దని బాలికను బెదిరించారు. అయితే బాలికి తన తండ్రికి చెబుతానని చెప్పడంతో ఇద్దరూ బయపడిపోయారు. ఏం చేయాలో అర్థం కాక ఇద్దరూ కలిసి బాలిక గొంతునొక్కి హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి సమీపంలోని పాడుబడిన బావిలో పడేశారు.
అయితే రాత్రైనా కూతురు ఇంటికి రాకపోవడంతో కంగారుపడిపోయిన తల్లిదండ్రులు చిన్నారి కోసం వెతకడం స్టార్ట్ చేశారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సమీపంలోని బావిలో దుర్వాసన రావడాన్ని గమనించిన వారు బావిలోని సంచిలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అయితే బాలిక గొంతుకు గుడ్డ చుట్టి ఉండటాన్ని చూసి పోలీసులు, కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. ఎవరో బాలికను హత్య చేసి బావిలో పడేసి ఉంటారని అనుమానం వ్యక్తి చేశారు.ఇక ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పోలీసులు కీలక విషయాలను గుర్తించారు. పెనుగులాట సమయంలో బాలికన మహిళ చేతిపై కొరికిన గుర్తుల ద్వారా నిందితురాలిని పోలీసులు పట్టుకొన్నారు. అమెను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వివాహితతో పాటు 17 ఏళ్ల యువకుడిని కూడా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు

## ఈనెల 15న జరగనున్న బిసి డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలి


### ఎమ్మెల్యే: మదన్ మోహన్ రావు



**కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ సెప్టెంబర్ 7/ అక్షరం న్యూస్:**

జిల్లా కేంద్రంలో ఈ నెల 15 న జరగనున్న కాంగ్రెస్ పార్టీ బీసీ డిప్లరేషన్ సభను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన మోహన్ రావు అన్నారు ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శు భం ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన బిసి డిక్లరేషన్ సన్నాహకసమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15 న నిర్వహించే సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారని అ న్నారు బీసీలుకాంగ్రెస్ పార్టీ నాయకులు కా ర్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనిసభను వి జయవంతం చేయాలని కోరారు పిసిసి అ ధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు పొన్నం ప్రభాకర్ ఉమ్మడి నిజామాబాద్ జి ల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క తో కలిసి సభ ఏర్పాట్లపై చర్చించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ ష బ్బీర్ ఎంపీసురేష్ షెట్కర్ తదితరులు కాం గ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొ న్నారు

## ఆపన్న హస్తానికి బల్మూరి బరోసా



**కరీంనగర్/హుజురాబాద్/ సెప్టెంబర్07/అక్షరం న్యూస్:**

హుజూరాబాద్ మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన కన్న ప్రతాప్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా స్థానిక హుజూరాబాద్ మండల యువజన కాంగ్రెస్ నాయకుల ద్వారా ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ డా.బల్మూర్ వెంకట్ వారి కుటుంబానికి నాయకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని పంపించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి కుటుంబానికి ఏళ్ల వేళలా అండగా ఉంటానని తెలిపారు .ఈ కార్యక్రమంలో ,రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ ఇమ్మడి దయాకర్,హుజురాబాద్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పంజాల అరవింద్ ,హుజురాబాద్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు రంజిత్ రెడ్డి ,సందీప్ కాట్రపల్లి గ్రామశాఖ అధ్యక్షులు శ్రీనివాస్ ,హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ భిక్షపతి ,యువజన కాంగ్రెస్ నాయకులువిష్ణు ,నాగరాజు ,సురేందర్ ,అమర్ కాంగ్రెస్ నాయకులు ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

## కట్టకింది తాండ రోడ్డును పరిశీలించిన ఆర్డి ఓ: పార్థసింహారెడ్డి



**కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ సెప్టెంబర్ 7/ అక్షరంన్యూస్:**

ఎల్లారెడ్డి మండల కేంద్రం లో ని హాజీపూర్ కట్టకింద తండా రోడ్డు మర మ్మతు పనులను ఆదివారం ఆర్డీవో పార్థ సింహారెడ్డి పరిశీలించారుఎల్లారెడ్డి- కామా రెడ్డి మెయిన్ రోడ్ నుంచి రెండు కిలోమీట ర్ల మేర రహదారిని ఏర్పాటు చేయాలని ఆ ర్డీవో పార్థసింహారెడ్డిని తండావాసులుకలిసి విజ్ఞప్తి చేశారుఇటీవల ఎల్లారెడ్డి మండలం లో కురిసిన భారీ వర్షాలకు పోటెత్తిన వరద కారణంగా కట్టకింది తండాకు వెళ్లే రహదా రి కొట్టుకుపోయిందిదీంతో తండావాసుల కు ఎల్లారెడ్డికి రావడానికి సరైన రోడ్డు మా ర్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎ దుర్కొన్నారు ప్రస్తుతం రోడ్డు మరమ్మతు ప నులు జరుగుతుండగా ఆదివారంతండా వాసులు ఆర్డీవో పార్థ సింహారెడ్డి దృష్టికి స మస్యను తీసుకువెళ్లగా తండావాసుల వి జ్ఞప్తి మేరకు ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థా యిలో రోడ్డు పనులను పూర్తి చేసి తండా వాసులకు అందుబాటులోకి తీసుకువస్తా మని ఆర్డీవో తెలిపారు




### జమ్మికుంట మున్సిపాలిటీలో ఔట్ సోర్స్ ఉద్యోగి అతి ఉత్సాహం
### పట్టణంలోని వైన్ షాపుల నుండి అక్రమ వసూలు
### మున్సిపాలిటీ రసీదు ఇవ్వకుండా అక్రమంగా దందా.
### మున్సిపాలిటీ కమిషనర్ ,వరంగల్ ఆర్డీ లకు తెలిసే జరుగుతున్నాయా?

**కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 07/అక్షరం న్యూస్:**

జమ్మికుంట మున్సిపాలిటీలో ఓచిట్ సోర్సింగ్ ఉద్యోగి అతి ఉత్సాహం ప్రదర్శించి జమ్మికుంట పట్టణంలోని 11 వైన్ షాప్ ల వద్ద నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ ఎలాంటి రసీదు ఇవ్వడం లేదు.

రసీదు ఇవ్వకుండా మీకు డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించిన యజమాన్యంపై మునిసిపాలిటీ నుండి జరిమానా విధిస్తామని బెదిరింపులు, మీ షాపు సీజ్ చేస్తావని బెదిరింపులు, ఈ అక్రమ వసూల్ మున్సిపాలిటీ కమిషనర్ కు తెలిసే జరుగుతున్నాయా? లేదా జిల్లా యంత్రాంగం ప్రోత్సాహంతో జరుగుతున్నాయా? అనేది పట్టణవాసుల అర్థం కాని ప్రశ్న ? పూర్తి వివరాల్లోకి వెళితే జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో గల వైన్ షాప్ లో మునిసిపాటిలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగి వైన్ షాప్ యాజమాన్యాలను బెదిరింపులకు గురి చేసి తన మనుషులను పంపించి ఎలాంటి రసీదు లేకుండా 20,000 నుండి 25 వేల రూపాయలు రూపాయలు ఇవ్వాలని హుకుం జారీ చేశాడు. వైన్ షాప్ యజమానులు మున్సిపాలిటీ రషీద్ ఇవ్వండి అని వచ్చిన కార్మికుని అడగగా ఔట్సోర్సింగ్ ఉద్యోగి అయిన వ్యక్తికి ఫోన్ కల్పించి యజమానిని ఫోన్ లోనే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని,ఇవ్వకుంటే నీ యొక్క షాప్ ను సీజ్ చేస్తాం అని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. పట్టణంలో జరుగుతున్న అక్రమవాసులు మున్సిపాలిటీ కమిషనర్ , వరంగల్ ఆర్డీ లకు తెలిసే జరుగుతున్నాయా లేక ఔట్సోర్సు ఉద్యోగి ఉన్నతాధికాల కనులు కప్పి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడా? అనేది జమ్మికుంట ప్రజలకు అర్థం కాని ప్రశ్న? ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఇలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఉద్యోగుల పైన ఒక కన్నేసి మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడకుండా సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.






## ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనం

**కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ సెప్టెంబర్ 7/ అక్షరం న్యూస్:**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో వినాయ క ఉత్సవాలు ఆదివారం నిమజ్జన వేడుక లతో ప్ర శాంతంగా ముగిసాయి ఎల్లారెడ్డి పట్టణంలో గత పది రోజులుగా వినాయక ఉత్సవాలు ఆయా మండపాల నిర్వాహకులుభక్తులు ఘనంగా నిర్వ హించుకున్నారుపదో రోజు గణేష్ నిమజ్జన శోభా యాత్ర ప్రారంభం కాగా ప్రభుత్వ శాఖల సమన్వ యంతో ముఖ్యంగారెవెన్యూ పోలీస్ విద్యుత్తు ము న్సిపల్ ఫైర్ శాఖలకు చెందిన అధికారులుసిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో నిమజ్జన వేడుక లు ప్రశాంతంగా ముగిశాయి నిమజ్జనం వేడుకలకు సహకరించిన వినాయక మండపాల నిర్వాహకుల కుభక్తులకుపోలీస్ శాఖవారుకృతజ్ఞతలు తెలిపారు

## కమ్యూనిస్టు నాయకుడు మృతి.... పరామర్శ



**జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షర%శీ%న్యూస్) సెప్టెంబర్ 07**

: మండలంలోని ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన సిపిఐ పార్టీ నాయకుడు శివర్ల అంజయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు, విషయం తెలుసుకున్న సిపిఐ పార్టీ జనగామ జిల్లా కార్యవర్గ సభ్యుడు కావటి యాదగిరి ఇబ్రహీం పురం గ్రామానికి వెళ్లి అంజయ్య మృతుదేహానికి పార్టీ కండువా కప్పి పూలమాల వేసి ఘనంగా అయనకు నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూకమ్యూనిస్ట్ గ్రామ పార్టీ నాయకుడు అంజయ్య మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని అయన అన్నారు. పరామర్శించిన వారిలో సిపిఐ పార్టీ జనగామ జిల్లా కార్యవర్గ సభ్యుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చొప్పరి సోమయ్య, చంద్రయ్య, మండల కమిటీ సభ్యులు పండుగ మల్లేశం, గ్రామ నాయకులు పులి మల్లేశం, వెంకన్న చింత సుధాకర్ ఇంత యాదగిరి,శీను,చివర్ల మల్లేష్, శీను, కుమార్, రామచందర్, తదితరులు ఉన్నారు.

## కోమాళ్ళలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) సెప్టెంబర్ 07:**

మండలంలోని కోమళ్ళ ఎస్సీ కాలనీలో కష్టాలు తొలగిం చడానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మంజూరయిన 230 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా గ్రంధాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ లు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లపల్లి కుమారస్వామి, నాయకులు తాటికొండ వెంకటేష్ యాదవ్, బంధ కుమారస్వామి, మేకల జైహింద్, పేర బోయిన రాజు, మేకల అజయ్, వెలిశాల స్వామి, బొల్లేపల్లి సత్తయ్య, మేకల ఎలిష్, బొల్లపల్లి వెంకటస్వామి, మైలారపు వెంకటేశ్వర్లు, దుండ్ర రవి, బంద ఎల్లమ్మ, కొంచెం మైసయ్యలు తదితరులు పాల్గొన్నారు.

# మండల ఉపాధ్యక్షుడికీ ఘన సన్మానం



**రామగిరి (పెద్దపల్లి జిల్లా) సెప్టెంబర్ 07 అక్షరం న్యూస్**

రామగిరి మండలం ఆర్ఎంపి పిఎంపి సంఘం నూతనంగా మండల ఉపాధ్యక్షుడిగా సుంకే ప్రవీణ్ ఎన్నికైన సందర్భంగా ఆదివారం రామగిరి మండలం నాగేపల్లి గ్రామం లోని ఆర్ఎంపి భవన్ లో మండల అధ్యక్షుడు బొద్దుల జగదీశ్వర్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి పిఎంపి మండల జనరల్ సెక్రెటరీ గండి పైడయ్య, కోశాధికారి సందీప్, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు..

# నిండు నూరేళ్లు చల్లగా ఉండు

## పట్టు వస్త్రాల బహూకరించిన సమ్మి గౌడ్



**మహబూబాబాద్ /కేసముద్రం /సెప్టెంబర్ 7/అక్షరం న్యూస్ :**

–కేసముద్రం మండలం అమీనాపురం గ్రామానికి చెందిన ఇనుముల సుజాత–కర్ణాకర్ (ఫోటోగ్రాఫర్) దంపతుల కుమార్తె రక్షిత నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుక రెడ్డి ఫంక్షన్ హాల్ లో జరగగా ఈ వేడుకలో పాల్గొని చిన్నారి రక్షిత కి నూతన పట్టు వస్త్రాలు బహుకరించి,చిన్నారి తల్లిదండ్రులకు నూతన వస్త్రాలు అందజేసి చిన్నారి ని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో,సంతోషంతో చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారికి మెండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రక్షితని ఆశీర్వదించారు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ,రవి, కృష్ణ మలిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాక్సింగ్ లొ జాతీయ స్థాయి పథకం సాధించిన గాయత్రి కళాశాల విద్యార్థి



**పెద్దపల్లి టౌన్ సెప్టెంబర్ 07 అక్షరం న్యూస్**

పెద్దపల్లి గాయత్రి డిగ్రీ పీజీ కళాశాలకు చెందిన పీజీ సెకండియర్ చదువుతున్న అప్పన్నపేట గ్రామానికి చెందిన పిడుగు శ్రీకాంత్ పంజాబ్లో ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బటిన్న గురుకాశీ యూనివర్సిటీలొ జరిగిన బాక్సింగ్ 80-86 కేజీల విభాగంలో శాతవాహన యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో పతకం సాధించాడు ఈ ఘనత సాధించడానికి కళాశాల అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలిపారు క్రీడారంగంలో గాయత్రి కళాశాల విద్యార్థులు దక్కించుకుంటున్న ఈ గుర్తింపు విద్యా, క్రీడా రంగాలలో స్ఫూర్తి దాయకంగా నిలిచేలా చేస్తుందన్నారు ఈ విజయాన్ని సాధించినందుకు డిగ్రీ కళాశాల అది నేత అల్లంకి శ్రీనివాస్ అందించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జే.రవీందర్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# ఛత్రపతి శంభాజీ మహారాజ్ యూత్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**పెద్దపల్లి టౌన్ సెప్టెంబర్ 6 అక్షరం న్యూస్:**

పెద్దపల్లి పట్టణంలోని లక్ష్మీనగర్ ఛత్రపతి శంభాజీ మహారాజ్ యూత్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ముందుగా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా కొనసాగించేందుకు సహకరించిన కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా పోరండ్ల పరమేశ్వర్, అధ్యక్షులుగా నేదునూరి ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా మహేష్ ప్రసాద్ రావు, ఉపాధ్యక్షులుగా మంద మహేష్, పోరండ్ల బాలాజీ, దోమకొండ శ్రీకాంత్, మంద అభినయ్, కొమిరిశెట్టి ప్రేమ్ కుమార్, చంద్రగిరి మురళి,కొమరవెల్లి కార్తీక్,కోశాధికారిగా పోరండ్ల వివేకానంద్ప్రచార కార్యదర్శులు గా ఆసంపల్లి రఘు మోహన్,సలహాదారులుగా మంద సంపత్, గాదెల చొక్కయ్యకమిట్ మెంబర్స్ గా ఆ మంద రాజయ్య, నిడదవోలు రాంబాబు,పల్లెర్ల సురేష్, పులి ఓంకార్, రాంనేని రాజేష్,ఐరెడ్డి వెంకటరెడ్డి,గుర్రాల రాజు,అప్పాల సత్యనారాయణ, ఫల్లాల వెంకన్న, రౌతు రాజయ్య, కొరవేణి శ్రీనివాస్,కూరాజ్ భూమయ్య, కొమిరిశెట్టి మల్లేష్, కేతిరెడ్డి ప్రవీణ్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు కాలనీవాసుల తో పాటు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# యూరియా సెంటర్‌ను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

## ౹రైతులకు యూరియా పంపిణీ లో ఎలాంటి జాప్యం జరగకూడదు ౹జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల





**మహబూబాబాద్/కేసముద్రం/సెప్టెంబర్ 7/అక్షరం న్యూస్:-**

మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కల్వల సెంటర్ యందు పంపిణీ చేస్తున్న యూరియా సెంటర్ ను జిల్లా వ్యవసాయ అధికారి ఎం విజయ నిర్మల తనిఖీ చేసి కల్వల సెంటర్లో ఉన్నటు వంటి యూరియా నిలువలు,స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, అక్విటెన్స్, పరిశీలి ంచడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ పరిధిలో ఆయా సెం టర్ల వారీగా వారికి వచ్చినటువంటి యూరియా నిలువలను, పట్టాదారు మరి యు ఆధార్ కార్డు ఆధారంగా ఏ రోజు కా రోజు రైతులకు పంపిణీ చేయాలని వారు సూచించారు.ఆ సెంటర్లో అలాట్మెంట్ అయిన యూరియాను ఆ యొక్క రెవిన్యూ గ్రామ రైతు సోదరులు వచ్చిన రోజే వారి యొక్క ఆధార్ కార్డు,భూమి పట్టాదార్ పాస్ బుక్, జిరాక్స్, తీసుకువెళ్లి యూరియా పొందాలని వారు తెలిపారు, 24 గంటల లోపు యూరియాను తీసుకోని రైతుల యొక్క యూరియా బస్తాలను తదుపరి సీరియల్ నెంబర్ వారీగా ఉన్న రైతులకు పంపిణీ చేస్తామని వారు తెలియజే శారు.ప్రస్తుతము రైతులకు ఎటు వంటి అసౌకర్యం కలిగిం చకుండా రైతు భరోసా పోర్టల్ నుంచి డౌన్లోడ్ చేసినటువంటి రైతుల జాబితాను రెవెన్యూ గ్రామాల వారిగా సొసైటీ సెంటర్ల వారిగా రెవిన్యూ గ్రామంలో పట్టాదార్ పాస్ బుక్ మొదటి సీరియల్ నెంబర్ నుండి చివరి సీరియల్ నెంబర్ వరకు రైతులకు పంపిణీ చేయడం జరుగుతుం ది.విడతల వారీగా కేసముద్రం మండలానికి యూరియా వస్తుంది కావున రైతులెవరు అదర్యపడ ద్దని అన్నారు యూరియా పంపిణీకి రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి ఎరువుల సెంటర్లలో గ్రూపులుగా ఏర్పాటు చేసి రైతులకు యూరియా పంపిణీ చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో సహాయ వ్యవసా య సంచారకులు, మహబూ బాబాద్ డివిజన్ అజ్మీర శ్రీనివాస రావు స్టేషన్ హౌస్ ఆఫీసర్ మురళీ ధర్ రాజు,మండల వ్యవసాయ అధికారి బి వెంకన్న , వ్యవసాయ విస్తరణ అధికారులు,పోలీస్ శాఖ సిబ్బంది,సొసైటీ సిబ్బంది లు పాల్గొన్నారు.



## విద్యుత్ డిమాండ్ లేకపోవడంతో ఎన్టిపిసి రామగుండంలో

# 4 యూనిట్లు మూసివేత... ఎన్టిపిసి కి భారీ నష్టం

**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 7 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా భారీ ఎత్తున కురిసిన వర్షాల కారణంగా విద్యుత్ డిమాండ్ లేకపోవడంతో 2600 మెగావాట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ లో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నాలుగు యూనిట్లు మూసివేశారు వేశారు. 500 మెగావాట్ల ఆరో యూనిట్ లో గత 25 రోజులుగా వార్షిక మరమ్మత్తులు నిమిత్తం ఉత్పత్తి నిలిపివేయగా, పవర్ డిమాండ్ లేకపోవడంతో గత సోమవారం 500 మెగావట్ల ఏడవ యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశారు. గత మూడు రోజులుగా మొదటి దశలోని 200 మెగావాట్ల రెండవ మూడవ యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశారు. రెండవ దశలోని 500 మెగావాట్ల ఐదవ యూనిట్ లో కూడా విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి మాత్రమే నడుపుతున్నారు. మొదటి దశలోని 200 మెగవట్ల ఒకటే యూనిట్లో విద్యుత్పత్తి కొనసాగిస్తున్నారు. ఆదివారం కేవలం 700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే ఉత్పత్తి జరుగుతుండగా 1900 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఇది ఎన్టిపిసి రామగుండం 35 ఏళ్ల చరిత్రలో మొదటిసారి అని భావిస్తున్నారు. దక్షిణ భారతదేశానికి వెలుగులు అందించే ఎన్టిపిసి రామగుండం లో ఇలా యూనిట్ల మూసివేత ఎన్నడు జరగలేదు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రం కోసం నిర్మించిన 800 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ లోని రెండు యూనిట్లలో ఒక్క యూనిట్ మాత్రమే నడిపిస్తున్నారు. అందులో రెండవ యూనిట్లో కేవలం 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే సగం లోడ్ తో నడిపించడం గమనార్హం. ప్రస్తుతం ఎన్టిపిసి రిజర్వాయర్లో నిర్మించిన 100 మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ స్టేషన్, రాజీవ్ రహదారి పక్కన నిర్మించిన పది మెగావాట్ల సోలార్ పవర్ స్టేషన్ లో మాత్రమే పూర్తిస్థాయి విద్యుత్ పత్తి జరుపుతున్నారు. ఇలా విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలగడంతో ఎన్టిపిసికి భారీ నష్టం వాటిల్లుతుంది. ఈ పరిస్థితి ఎంత కాలం కొనసాగుతో తెలియడం లేదు. రామగుండం ఎన్టిపిసి ఉద్యోగులు ఇలా ఎన్ని యూనిట్లు ఒకేసారి మూతపడటం ఎన్నడూ జరగలేదని చర్చిస్తున్నారు. విద్యుత్తు డిమాండ్ పెరిగితే గాని మళ్లీ ఈ యూనిట్లలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి జరిగే అవకాశం లేదు.

# ఎన్టిపిసి రామగుండంలో గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో కేవలం 212 మంది ఓటర్లు...

**22వందల నుంచి 212 పడిపోయిన ఓటర్ల సంఖ్య**

**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 7 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

ఎన్టిపిసి రామగుండం ప్రారంభం లో ఉద్యోగుల సంఖ్య 2200 పైచిలుకు ఉండేది. 1978లో ప్రారంభమైన రామగుండం ఎన్టిపిసి ఉద్యోగులతో కళకళలాడేది. ఆ రోజుల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఉండేది. ప్రతి ఏటా ఈ యూనియన్కు ఎన్నికలు జరిగేవి. అధ్యక్షుడు సెక్రటరీ కోశాధికారి కల్చరల్ సెక్రటరీ స్పోర్ట్స్ సెక్రెటరీ వెల్ఫేర్ సెక్రెటరీ ఇలాంటి పదవులకు ఆ రోజుల్లో యువకులుగా ఉన్న అనేక మంది ఉద్యోగులు పోటీపడేవారు. యూనియన్ల తరఫున ప్యానెల్స్ గ నిలబడి ఎన్నికల్లో పాల్గొనేవారు. ఎంతో ఉత్సాహభరితంగా ఎన్నికల ప్రచారంతో వాతావరణం కొత్త అందాలు సంతరించుకునేది. ఆ తర్వాత కార్యక్రమం లో గుర్తింపు యూనియన్ ఎన్నికలు మొదలయ్యాయి. రామగుండం ఏంటి పిసిలో ఐఎన్టియుసి టిఎన్టియుసి సిఐటియు హెచ్ ఎం ఎస్ బి ఎం ఎస్ తదితర యూనియన్లు గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో పోటీపడేవి. ఈ యూనియన్ ఎన్నికల కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉండేది. వరకు జరిగిన అనేక ఎన్నికల్లో ఐఎన్టీయూసీ ఘన విజయం సాధిస్తూ వచ్చింది. ఐఎన్టియుసికి వ్యతిరేకంగా మిగతా యూనియన్లు అన్ని జట్టు గట్టి పోటీ చేసి ఐదు సార్లు గెలిచాయి. గత 20 సంవత్సరాల నుంచి ఉద్యోగులు రిటైర్ కావడం కొందరు సూపర్వైజర్లుగా అధికారులుగా ప్రమోషన్లు పొందుతూ ఉండడంతో ఓటర్ల సంఖ్య తగ్గుముఖం పట్టింది. గడిచిన ఐదు సంవత్సరాలుగా సుమారు 500 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వారి స్థానంలో కొత్త ఉద్యోగుల రిక్రూట్మెంట్ లేకపోవడం వల్ల ఓటర్ల సంఖ్య భారీగా తగ్గింది. మూడు ఇళ్ల క్రితం జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో 350 కి పైగా ఓట్లు ఉండేది. ఈనెల 25న జరిగే గుర్తింపు ఎన్నికల్లో కేవలం 212 మంది మాత్రమే ఎన్నికల్లో ఓటు వేస్తారు. ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు రిటైర్మెంట్ కావడంతో కొన్ని యూనియన్లు కనుమరుగయ్యాయి. మరి కొన్ని యూనియన్లు కార్యకర్తలు లేక ఇతర యూనియన్లలో చేరిపోయారు. కొందరు ప్రముఖ లీడర్లు అధికారులుగా పదోన్నతి సాధించడంతో వారు ఇతర ప్రాంతాలకు బదిలీ అయి వెళ్లిపోయారు. దీంతో సిఐటియు లాంటి ప్రముఖ యూనియన్ బలహీనపడింది. ప్రస్తుతం వరుసగా రెండుసార్లు గెలిచిన ఐ ఎన్ టి యు సి బలంగా బలంగా కనిపిస్తున్నప్పటికీ బిఎంఎస్ కూడా ఈసారి గెలిచేందుకు తగిన వ్యూహాలు రచిస్తోంది. ఈసారి అతి తక్కువ ఓటర్లతో జరుగుతున్న ఈ ఎన్నికల్లో విజయం ఏ యూనియన్ వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

# ‘ఆఫ్‌లైన్’ వెనుక మర్మమేంది?

## కేంద్ర సాధికార కమిటీనే తప్పుదోవ పట్టించాలనుకున్నరా?
## చెట్ల నరికివేత తర్వాత.. ముందు తేదీలతో మాన్యువల్ ప్రక్రియ
## కంచ గచ్చిబౌలి భూముల్లో అడుగడుగునా అధికారుల తప్పిదాలు

**హైదరాబాద్ అక్షరం న్యూస్:**

వ్యక్తి/సంస్థ/కంపెనీ ఎవరైనా పట్టా భూమిలోగాని, ప్రభుత్వ, అసైన్డ్, లీజు భూముల్లోగాని కొత్త ప్రాజెక్టును ప్రారంభించే ముందు చెట్లను తొలగించాలనుకుంటే కచ్చితంగా ఆన్‌లైన్‌లో యాజమాన్య ధ్రువీకరణతో పాటు ఫారం 13-ఏ ద్వారా పూర్తి వివరాలను సమర్పించి అనుమతి తీసుకోవాలి. ఇన్‌స్పెక్షన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, పరిహారం కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. వివిధ హోదాల్లోని అటవీ శాఖ అధికారులు సైతం ఆన్‌లైన్‌లో తదుపరి దశల్లో పురోగతిని నమోదు చేయాలి.

వాల్టా-2002కు సవరణ చేసి 2017లో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 23 సారాంశమిది

టీజీఐఐసీ జోనల్ మేనేజర్ గత నెల 17న శేరిలింగంపల్లి తహసీల్దార్ ఇచ్చిన యాజమాన్య ధ్రువీకరణతో చెట్ల తొలగింపునకు గాను శంషాబాద్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి (ఎఫ్‌డీవో)కి ఫారం 13-ఏను జత చేసి లేఖ రాశారు. దాని ఆధారంగా తదుపరి ప్రక్రియలు నిర్వహించి అనుమతులు తీసుకున్నాం.

హెచ్‌సీయూలో చెట్ల నరికివేతకు ముందు తీసుకున్న అనుమతి ప్రక్రియపై టీజీఐఐసీ-అటవీ శాఖ అధికారులు కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ)కి ఇచ్చిన వివరాల సారాంశమిది. సీఈసీ నివేదికలోని 21వ పేరాగ్రాఫ్‌లో ఉన్న వివరాలివే. ప్రభుత్వ ఉత్తర్వుల్లో అనుమతుల ప్రక్రియ అంతా కచ్చితంగా ఆన్‌లైన్‌లోనే ఉండాలని ప్రభుత్వమే స్పష్టంచేసింది. కానీ టీజీఐఐసీ, అటవీ శాఖ అధికారులు చెప్తున్న ప్రకారం వ్యవహారమంతా ఆఫ్‌లైన్ (మాన్యువల్‌గా)లో జరిగింది. అంటే జీవోను ఉల్లంఘించిమరీ చేపట్టినట్టు స్పష్టమవుతున్నది. పైకి చూసేందుకు కేవలం ఉల్లంఘనలానే కనిపిస్తున్నది. లోతుకు వెళ్తే అసలు చెట్ల నరికివేతకు ముందు ‘అనుమతులు’ అనే అంశాన్నే పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనల పరంపరలో కాంగ్రెస్ ప్రభుత్వం దుందుడుకుగా వ్యవహరించి.. రాత్రికి రాత్రి బుల్డోజర్లతో విరుచుకుపడింది.మూడు రోజుల పాటు రేయింబవళ్లు పర్యావరణ విధ్వంసానికి పాల్పడింది. తీరా యావత్తు దేశంతో పాటు సుప్రీంకోర్టు సైతం ఉలిక్కిపడి ఇటువైపు చూడటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. దేశ అత్యున్నత న్యాయస్థానం రంగంలోకి దిగడంతో ‘వాల్టా చట్టం కింద అనుమతులు’ మాటున తప్పించుకునే ప్రయత్నాలు జరిగాయనే విమర్శలున్నాయి. అందులో భాగంగానే జీవో 23 అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రభుత్వ, ప్రైవేటు కోణంలో కచ్చితంగా ఆన్‌లైన్‌లోనే సాగిన అటవీ శాఖ అనుమతుల ప్రక్రియ ఇప్పుడు మాత్రం ఆఫ్‌లైన్ చేశామనడమే అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నది. దీంతో అధికార యంత్రాంగం చివరికి కేంద్ర సాధికార కమిటీని సైతం తప్పుదోవ పట్టించిందా? అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే కేంద్ర సాధికార కమిటీ సైతం తన నివేదికలో ‘ఇవన్నీ తప్పుదోవ పట్టించే ప్రయత్నాలుగా ఉన్నాయి’ అని పేర్కొనడం గమనార్హం.



అంతా ఆన్‌లైన్‌లో చేయాలన్న ఆదేశాలు..రాష్ట్రంలో వాల్టా-2002 సవరణతో 2017లో కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 23 తర్వాత వ్యక్తులు, సంస్థలు చివరకు ప్రభుత్వపరంగా నిర్మించే సాగునీటి, ఇతర ప్రాజెక్టుల కోసం చెట్ల తొలగింపు చేపడితే అనుమతులు, ఫీజు చెల్లింపుల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే సాగుతున్నది. ఈ మేరకు గతంలో అనేకసార్లు ఆఫ్‌లైన్‌కు కొందరు అధికారులు ప్రయత్నం చేసినా అటవీ శాఖ ఉన్నతాధికారులు తమ సమీక్షల్లో కేవలం ఆన్‌లైన్‌లోనే చేయాలని, మాన్యువల్‌ను అంగీకరించొద్దనే ఆదేశాలూ జారీ చేసిన సందర్భాలున్నాయి. కానీ మొదటిసారిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో చెట్ల నరికివేతకు సంబంధించి మాత్రం ఆఫ్‌లైన్‌లో అనుమతుల ప్రక్రియ జరిగినట్టుగా అటవీ శాఖ అధికారులు చెప్తుండటం తీవ్ర అనుమానాలకు తావిస్తున్నది. కేంద్ర సాధికార కమిటీకి ఇచ్చిన నివేదికలో అటవీ శాఖనే దీన్ని వివరించింది. గత నెల 17న టీజీఐఐసీ జోనల్ మేనేజర్ 13-ఏ ఫారంతో పాటు మినహాయింపు ఉన్న చెట్ల మదింపునకు శంషాబాద్ ఎఫ్‌డీవోకు దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు.

గత నెల 20న డీఎఫ్‌వో ఆ లేఖను స్వీకరించారు. గత నెల 29న టీజీఐఐసీ ఇన్‌స్పెక్షన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, పరిహార ఫీజులను చెల్లించిందని తెలిపారు. మరుసటి రోజు అంటే గత నెల 30న చెట్ల నరికివేత చేపట్టారనేది అటవీ శాఖ అధికారుల వివరణ. ఆ తర్వాత ఈ నెల 3న (వివాదం జాతీయస్థాయిలో సంచలనమైన తర్వాత) శంషాబాద్ ఎఫ్ఆర్వో పరిశీలించగా మొత్తం 1524 చెట్లను నరికివేస్తే అందులో 125 మినహాయింపులేని చెట్లున్నాయని, మూడు జేసీబీలను సీజ్ చేశామని అటవీ శాఖ నివేదికలో చెప్పారు. వాస్తవానికి అధికారులు అనుమతి ఇచ్చే ముందు చెట్ల లెక్కింపు, వాటి ఎత్తు, సమగ్ర వివరాలతో పాటు నరికివేసిన తర్వాత కాండం చుట్టుకొలత వంటి వివరాలు నమోదు చేయాలి. కానీ బుల్డోజర్లతో చెట్ల మొదళ్లను సైతం పెకిలించినవే ఎక్కువ ఉన్నందున అధికారులు వాటిని అసలు అంచనా వేసే పరిస్థితి కూడా లేదని తెలిసింది. అందుకే కేంద్ర సాధికార కమిటీ ఈ అనుమతుల ప్రక్రియ, అటవీ శాఖ నివేదికపై అనుమానాలు వ్యక్తం చేయడంతోపాటు తీవ్ర ఆక్షేపణలు కూడా చేసింది. అటవీ శాఖ ఇచ్చిన నివేదికలో ఫారం 13-ఏలో చెట్ల రకాలు, ఎత్తు, చుట్టుకొలత వివరాలే లేవు.

ఫారం-13ఏలో అసంపూర్తి వివరాలను పరిశీలిస్తే టీజీఐఐసీ, అటవీ శాఖ అధికారులు తూతూమంత్రంగా ఫారం నింపారని అర్థమవుతున్నది.అధికారులు ఫారంలో తెలిపిన వివరాలకు, క్షేత్రస్థాయిలో కమిటీ పరిశీలించిన విషయాలకు చాలా వ్యత్యాసం ఉన్నది.

టీజీఐఐసీ 400 ఎకరాలను సేకరించి వాటిలో 122 ఎకరాల్లోనే చెట్ల తొలగింపునకు 13-ఏ కింద దరఖాస్తు చేసుకున్నది. కానీ డీఎఫ్‌వో ఇచ్చిన డాక్యుమెంట్లలో 150 ఎకరాలు అని ఉన్నది. పోలీసు శాఖకు ఇచ్చిన లేఖలో ఏకంగా 400 ఎకరాలుగా ఉన్నది.ఈ నెల 3న టీజీఐఐసీ తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (ఎస్పీసీబీ) నుంచి తీసుకున్న సీఎఫ్ఈ (కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) అనుమతిలో 122.63 ఎకరాలుగా ఉన్నది.‘వీటన్నింటినీ పరిశీలిస్తే కేవలం పారదర్శకత లోపించినట్టుగానే అనిపించడం లేదు. విచారణ అధికారులను తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నాలుగా ఉన్నాయి. చట్టపరమైన పరిశీలన నుంచి తప్పించుకునేందుకు ఈ ప్రయత్నాలు చేసినట్టుగా అనిపిస్తున్నది’ అని సీఈసీ ఆక్షేపించడం అనుమతులన్నీ చెట్ల నరికివేత తర్వాత చేసిన గూడుపుఠాణి అనేందుకు బలాన్ని చేకూర్చేలా ఉన్నాయని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# రియల్ ఆదాయం పాతాళానికి!..

## కాంగ్రెస్ పాలనలో పడిపోయిన స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ

**ఫిబ్రవరి నెలలో వచ్చింది 38 శాతమే**
**తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఈ స్థాయి పతనం ఇదే తొలిసారి**
**రాష్ట్ర సొంత పన్నుల ఆదాయంలో రూ.91.81 కోట్ల తగ్గుదల నమోదు**
**కాగ్ నెలవారీ నివేదికలో వెల్లడి**
**2024-25 బడ్జెట్‌లో ఫిబ్రవరి నెలకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం అంచనా రూ.18,228.82 కోట్లు**
**ప్రభుత్వానికి వచ్చిన రాబడి రూ.7,033.38 కోట్లు**
**ఆదాయం శాతం: 38.58 నిరుడు ఇదే నెలలో వచ్చిన ఆదాయ శాతం: 70.16**

**హైదరాబాద్ అక్షరం న్యూస్:**

కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి దారుణంగా పడిపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, అవగాహనరహిత పాలన తెలంగాణ ప్రగతి పరుగుకు ప్రతిబంధకంగా మారింది. కరోనాకాలం నాటి కంటే కూడా రాబడి తగ్గిపోయింది. రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైంది. రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆదాయవనరు అయిన స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం ఘోరంగా పడిపోయింది. ఫిబ్రవరి నెలలో ఈ శాఖ ఆదాయం 38 శాతమే నమోదైంది. ఇంత దారుణంగా స్థిరాస్తి రాబడి పడిపోవడం తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇదే మొదటిసారి. కొవిడ్-19 మహమ్మారి సమయంలో కూడా ఇంతటి తగ్గుదల కనిపించలేదు.నాడు రియల్ రాబడి 42 శాతానికిపైగా నమోదైంది. రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం (ఎస్‌వోటీఆర్) కూడా పడిపోయింది. 2023-24లో రూ.1,24, 146. 19 కోట్లు కాగా, 2024-25 నాటికి రూ.1,24,054.38 కోట్లకు తగ్గింది. అంటే.. రూ.91.81 కోట్ల తగ్గుదల నమోదైంది. కాగ్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ఫిబ్రవరి నెల గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. రెవెన్యూ ఆదాయం ఫిబ్రవరి వరకు రూ.2,21,242.23 కోట్లు వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. కానీ, రూ.1,36,136.01 కోట్ల ఆదాయమే సమకూరింది.అంటే రేవంత్‌రెడ్డి సర్కారు నిర్దేశించుకున్న ఆదాయం లక్ష్యంలో 61.53 శాతానికి పరిమితమయ్యారు. గత ఏడాది ఇదే కాలానికి రూ.2,16,566.97 కోట్లు రాబడి అంచనా వేయగా, రూ.1,51,947.05 కోట్లు మేరకు చేరుకున్నారు. అంటే లక్ష్యంలో 70.16 శాతం అందుకున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెల వరకు రూ.1,93,029.40 కోట్ల ఆదాయం అంచనా వేయగా, రూ.1,33,850.82 కోట్లకు అంటే.. లక్ష్యం 69.34 శాతం మేరకు చేరారు. రేవంత్‌రెడ్డి సర్కారు మాత్రం ఆదాయ రాబడిలో చతికిలబడుతున్నది.



పాతాళానికి రియల్ ఆదాయం.. కేసీఆర్ పాలనలో పదేండ్లపాటు జోరు మీదున్న స్థిరాస్తి రంగం ఏడాది నుంచి నేలకరిచింది. బీఆర్ఎస్ హయాంలో ఏడాదికి ఏడాది క్రమంగా పెరుగుతూ వచ్చిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఆదాయం, రేవంత్‌రెడ్డి పాలనలో క్రమంగా తగ్గుముఖం పట్టింది. కాంగ్రెస్ సర్కారు తీసుకున్న హైడ్రా, ఎల్ఆర్ఎస్ వంటి అనాలోచిత చర్యలతో రియల్ ఆదాయం పడిపోయింది. భూములు అమ్మేవారు తప్ప కొనేవారు ఎవరూ లేకపోవడంతో బిజినెస్ మందగించింది. రాష్ట్ర ఖజానాకు కీలక ఆదాయాన్ని ఆర్జించి పెట్టే స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖకు ప్రభుత్వం నిర్దేశించిన రాబడి లక్ష్యాన్ని 40 శాతం కూడా అందుకోలేకపోయింది. బడ్జెట్‌లో ఫిబ్రవరి నెల ఆదాయం రూ.18,228.82 కోట్లు వస్తుందని అంచనా వేశారు. కానీ, రూ.7,033.38 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. అంటే.. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాబడి 38.58 శాతం వద్దే నిలిచిపోయింది. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల (ప్లాట్ల) అమ్మకాలు, కొనుగోళ్లు భారీగా తగ్గిపోయాయి. కేసీఆర్ పాలనలో గడిచిన పదేండ్లలో ఏనాడూ రియల్ రాబడి తగ్గలేదు. పైగా క్రమంగా పెరిగింది. పదేండ్లలో తొలిసారి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఆదాయం నిర్దేశించిన లక్ష్యంలో సగానికి కూడా చేరలేకపోయింది.కేసీఆర్ హయాంలో రాకెట్ వేగం.. కేసీఆర్ పదేండ్ల పాలనలో రియల్ ఎస్టేట్ రంగం రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. భూముల కొనుగోళ్లు, అమ్మకాలతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖనే రాష్ట్ర ఖజానాకు పెద్ద ఆదాయ వనరుగా మారింది. నాటి సీఎం కేసీఆర్ వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ, గృహ నిర్మాణ రంగాల అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపట్టారు. తద్వారా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు విపరీతంగా పెరిగాయి.

# సీటీ స్కాన్‌తో క్యాన్సర్!




**వయసు ఎంత తక్కువైతే ముప్పు అంత ఎక్కువ**
**తాజా అధ్యయనం హెచ్చరిక**

ఈస్ట్ ఆంగ్లియా (యూకే): మానవ శరీరంలో క్యాన్సర్‌ను కనుగొనడానికి సీటీ స్కాన్ నిర్వహిస్తారు. కానీ సీటీ స్కాన్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉన్న వారికి సైతం క్యాన్సర్ వచ్చే ప్రమాదమున్నదని తాజా అధ్యయనం వెల్లడించింది. ఆధునిక వైద్య పరిజ్ఞానంలో సీటీ స్కాన్ అనేది ఎంతో కీలకంగా మారిన సంగతి తెలిసిందే. సీటీ స్కాన్ చేయడం ద్వారా శరీరంలోని రుగ్మతలను వేగంగా, సమగ్రంగా తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. డాక్టర్లకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారింది. అయితే ఈ పరిజ్ఞానంపై అధికంగా ఆధారపడటం ప్రమాదకరం కావచ్చని ఈ అధ్యయనం హెచ్చరించింది. జామా ఇంటర్నల్ మెడిసిన్ పత్రికలో ఈ వివరాలు ప్రచురించారు.

ఇదే రీతిలో కొనసాగితే.. అమెరికాలో 2023లో నిర్వహించిన సీటీ స్కాన్‌ల కారణంగా లక్ష క్యాన్సర్ కేసులు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నదని ఆ అధ్యయనం హెచ్చరించింది. సీటీ స్కానింగ్‌ల రేటు ఇప్పుడున్న రీతిలోనే కొనసాగితే.. కేవలం సీటీ స్కాన్‌ల కారణంగానే ప్రపంచవ్యాప్తంగా ఐదు శాతం క్యాన్సర్ కేసులు పెరగవచ్చని తెలిపింది. ఇది ఆందోళనకరమని పేర్కొంది. అమెరికాలో గత పదేండ్ల కాలంలో సీటీ స్కాన్‌ల సంఖ్య 30 శాతం పెరిగిందని తెలిపింది. ఒకేఒక్కసారి సీటీ స్కాన్ చేయడం వల్ల ముప్పు చాలా తక్కువగా ఉండవచ్చు తప్ప అసలు లేకుండా పోయే అవకాశం లేదని పేర్కొంది. రోగి ఎంత తక్కువ వయస్సువారైతే ముప్పు అంత అధికంగా ఉంటుందని తెలిపింది. సాధారణంగా వైద్యులు చిన్న పిల్లలకు సీటీ స్కాన్‌ను సిఫారసు చేయరు. 90 శాతం వరకు సీటీ స్కాన్‌లు వయోజనులపైనే జరుగుతున్న నేపథ్యంలో వారికే ముప్పు అధికంగా ఉంటుందని తెలిపింది. ఆ క్యాన్సర్ల ముప్పు.. సీటీ స్కాన్ వల్ల ఊపిరితిత్తులు, పెద్ద పేగు, మూత్రాశయానికి క్యాన్సర్ సోకవచ్చని, లుకేమియా రావచ్చని, మహిళలకు రొమ్ము క్యాన్సర్ ముప్పు ఉంటుందని ఆ అధ్యయనం వెల్లడించింది. ఇదే అంశంపై 2009లో జరిగిన ఒక విశ్లేషణలో సీటీ స్కాన్‌ల వల్ల 29 వేల క్యాన్సర్ కేసులు నమోదు కావచ్చని అంచనా వేశారు. కానీ తాజా అంచనా అంతకు మూడు రెట్లు ఉండటం ఆందోళనకరం. పరిస్థితి ఇలాగే కొనసాగితే మద్యం, అధిక బరువు వల్ల ఎదురయ్యే ముప్పుతో సమానంగా సీటీ స్కాన్ బాధితులు కూడా ఉండవచ్చని అంచనా వేసింది. శరీరంలోని ఏ భాగాన్ని స్కాన్ చేసినా ఒకే విధమైన ముప్పు ఉండకపోవచ్చునని, ఉదరం, కటి భాగాన్ని సీటీ స్కాన్ చేయడం వల్ల మాత్రం భవిష్యత్తులో క్యాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపింది. ఏడాది లోపు పిల్లల తలను సీటీ స్కాన్ చేయడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించింది.అవసరమైతే తప్ప సీటీ స్కాన్ వద్దు..సీటీ స్కాన్ వల్ల క్యాన్సర్ ముప్పు ఉన్నప్పటికీ ప్రాణాలు కాపాడటంలో ఆ పరిజ్ఞానం కీలకమని వైద్యులు పేర్కొంటున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో రోగ నిర్ధారణకు సీటీ స్కాన్ దోహదపడుతుందని అంటున్నారు. తాజా హెచ్చరికల నేపథ్యంలో ఇకపై అవసరమైతే తప్ప వైద్యులు సీటీ స్కాన్‌ను సిఫారసు చేయకపోవడం మంచిదని ఆ అధ్యయనం సూచించింది. మరోవైపు సీటీ స్కాన్‌లు క్యాన్సర్ కారకాలని ఈ అధ్యయనం రుజువు చేయలేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ అధ్యయనంలోని అంచనాలన్నీ ‘రిస్క్ మాడల్స్’పై ఆధారపడినవి తప్ప ప్రత్యక్ష ఆధారాలు కాదని అంటున్నారు. రేడియేషన్ వల్ల క్యాన్సర్ రావచ్చన్నది కొత్త ఆవిష్కరణ కాదని, ఆ ముప్పు మొదటి నుంచీ ఉన్నదని పేర్కొన్నారు.

# ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ హాల్‌టికెట్లు.. 22 నుంచి ఇంజినీరింగ్ అడ్మిట్ కార్డులు

**హైదరాబాద్ అక్షరం న్యూస్:**




ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ ఎప్‌సెట్ కు సంబంధించి తెలంగాణ ఉన్నత విద్యామండలి కీలక ప్రకటన విడుదల చేసింది. శనివారం అగ్రికల్చర్, ఫార్మసీ హాల్ టికెట్లను విడుదల చేయనుంది. అదేవిధంగా ఇంజినీరింగ్ హాల్ టికెట్లను ఏప్రిల్ 22న ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి పరీక్ష తేదీ వరకు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించింది. అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్ష ఈ నెల 29, 30 తేదీల్లో జరుగనుంది. ఏప్రిల్ 29న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 12 గంటలకు వరకు రెండు సెషన్లలో పరీక్షను నిర్వహిస్తారు. ఇక ఈ నెల 30న ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఇంజినీరింగ్ పరీక్షను మే 2 నుంచి 4 వరకు నిర్వహిస్తారు. రోజూ రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 12 గంటలకు వరకు నిర్వహిస్తారు. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు 2,19,420 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ ఎగ్జామ్‌కు 86,101 మంది, రెండు పరీక్షలకు 253 మంది దరఖాస్తు చేసున్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో 124 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# ఇన్ఫీ నారాయణమూర్తి మనవడికి రూ.3.3 కోట్ల డివిడెండ్

ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణమూర్తి మరోమారు హెడ్‌లైన్స్‌లో నిలిచారు. అందుకు కారణం ఆయన 17 నెలల మనవడు ఏకాగ్రహ్ రోహన్ మూర్తి ఇన్ఫీ నుంచి డివిడెండ్ రూపంలో రూ.3.3 కోట్లు అందుకోవడమే.దేశీయ అగ్రగామని ఐటీ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి తుది డివిడెండ్‌ను ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.22 చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. దీంతో నారాయణమూర్తి మనవడు ఏకాగ్రహ్ రోహన్ మూర్తి ఇన్ఫీ నుంచి రూ.3.3 కోట్లు అందుకోనున్నాడు. చిన్న వయసులోనే ఏకాగ్రహ్‌కు రూ.కోట్లలో ఆదాయం లభించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఏకాగ్రహ్ రోహన్‌మూర్తి నాలుగు నెలల వయసు ఉన్నప్పుడే రూ.240 కోట్ల (అప్పటి విలువ) విలువైన షేర్లను నారాయణమూర్తి బహుమతిగా రాసిచ్చారు. రోహన్ మూర్తికి 15లక్షల ఇన్ఫోసిస్ షేర్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. ఇది కంపెనీలో మొత్తం విలువలో షేర్లు 0.04శాతం. తాతా గిఫ్ట్‌తో యంగ్ మిలియనీర్‌గా ఏకాగ్రహ్ అవతరించాడు. ఇక ఈ షేర్లకు గతేడాది రూ.7.35 కోట్ల డివిడెండ్ అందుకున్నాడు. ఈ ఏడాది రూ.3.3 కోట్లు అందుకోబోతున్నాడు. దీంతో ఇప్పటి వరకూ ఈ షేర్ల ద్వారా డివిడెండ్ రూపంలో ఈ చిన్నారి మొత్తం రూ. 10.65 కోట్లు సంపాదించాడు. ఏకాగ్రహ్ నవంబర్ 2023లో నారాయణమూర్తి- సుధామూర్తి దంపతుల కుమారుడు రోహన్‌మూర్తి, అపర్ణామూర్తికి జన్మించాడు. నారాయణమూర్తి-సుధామూర్తి దంపతులకు ఆయన మూడో మనవడు.


# బిజినెస్

## లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు



ముంబయి: అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:21 గంటల సమయంలో సెన్సెక్స్ 93 పాయింట్ల లాభంతో 62,942 దగ్గర ట్రేడవుతోంది. నిఫ్టీ 25 పాయింట్ల లాభంతో 18,660 వద్ద కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 82.47 దగ్గర ప్రారంభమైంది. సెన్సెక్స్ 30 సూచీలో టైటన్, టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, మారుతీ, అల్ట్రాటెక్ సిమెంట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. టాటా స్టీల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, ఎంఅండ్‌ఎం, సన్‌ఫార్మా, హెచ్‌యూఎల్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి. అమెరికా మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు ఫ్లాట్‌గా స్థిరపడ్డాయి. ఆసియా-పసిఫిక్ సూచీలు నేడు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 0.4 శాతం తగ్గి 76.65 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు గురువారం రూ.212.40 కోట్లు విలువ చేసే భారత ఈక్విటీలను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు రూ.405.01 కోట్లు విలువ చేసే షేర్లను విక్రయించారు. తాన్లా ప్లాట్‌ఫామ్స్, అమెరికాలోని ట్విలియో కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న వాల్యూఫస్ట్ డిజిటల్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ (వాల్యూఫస్ట్)ను సొంతం చేసుకోనుంది. రక్షణ ఉత్పత్తుల రంగానికి చెందిన హైదరాబాద్ కంపెనీ జెన్ టెక్నాలజీస్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి కొత్తగా రూ.202 కోట్ల విలువైన ఆర్డర్ లభించింది. ఇన్‌స్టెంట్ కాఫీ పొడిని ఉత్పత్తి చేసే సంస్థ అయిన సీసీఎల్ ప్రొడక్ట్స్ (ఇండియా) లిమిటెడ్, స్వీడన్ కేంద్రంగా పనిచేసే కాఫీ రోస్టర్స్ లాఫ్‌బర్గ్స్ గ్రూపు నుంచి 6 కాఫీ బ్రాండ్లు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయా కంపెనీల స్టాక్స్‌పై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది.

## కీలక వడ్డీరేట్లు యథాతథమే



ముంబయి: విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక రేట్లను యథాతథంగా కొనసాగించింది. మంగళవారం ప్రారంభమైన పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు.

రెపోరేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేట్ సైతం 6.75 శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమివ్వాల్సిన అవసరం ఉందనే భావనతోనే కీలక రేట్లలో ఆర్‌బీఐ మార్పులు చేయక పోవచ్చునని గతకొంత కాలంగా విశ్లేషణలు వెలువడుతున్న విషయం తెలిసిందే. గత ఏప్రిల్ సమావేశంలో రెపో రేటు ను ఎలాంటి మార్పు చేయకుండా 6.5 శాతంగా కొనసాగించారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు 2022 మే నుంచి వరుసగా ఆరు దఫాల్లో రెపో రేటును 250 బేసిస్ పాయింట్ల మేర ఆర్‌బీఐ పెంచింది. కీలక రేట్లపై నిర్ణయాన్ని తీసుకునేందుకు రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకుంటుంది. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్ఠమైన 4.7 శాతానికి దిగివచ్చిన విషయం తెలిసిందే. సర్దుబాటు విధాన వైఖరి ఉపసంహరణను కొనసాగించాలని పరపతి కమిటీ నిర్ణయించినట్లు శక్తికాంత దాస్ తెలిపారు. ద్రవ్యోల్బణ తీరుతెన్నులపై నిశిత, నిరంతర నిఘా కచ్చితంగా అవసరమని అభిప్రాయపడ్డారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నెమ్మదించే అవకాశం ఉందని అంచనా వేశారు. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు ఎంపీసీ ఎప్పటికప్పుడు కావాల్సిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. దేశీయంగా పుంజుకుంటున్న గిరాకీ వృద్ధికి ఊతమిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ గిరాకీ క్రమంగా పుంజుకుంటోందన్నారు. 595.1 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఖజానాలో ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటి వరకు ఆర్‌బీఐ తీసుకున్న ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలు సత్ఫలితాలిస్తున్నాయని శక్తికాంత దాస్ తెలిపారు. నాలుగో త్రైమాసికంలో ప్రస్తుత ఖాతా లోటు మరింత దిగొస్తుందని అంచనా వేశారు. జనవరి నుంచి రూపాయి మారకం విలువ స్థిరంగా కొనసాగుతోందని తెలిపారు. నాన్-రెసిడెంట్ డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 2022-23లో 3.2 బిలియన్ డాలర్ల నుంచి 8 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు వెల్లడించారు.

### ద్రవ్యోల్బణ అంచనాలు..

ద్రవ్యోల్బణం ప్రస్తుతం ఆర్‌బీఐ లక్షిత పరిధి అయిన 4 శాతం ఎగువనే ఉందని శక్తికాంత దాస్ తెలిపారు. ఈ ఏడాది మొత్తం అది అలాగే కొనసాగుతుందని అంచనా వేశారు. ఈ ఆర్థిక సంవత్సర ద్రవ్యోల్బణం అంచనాను 5.2 శాతం నుంచి 5.1 శాతానికి తగ్గించారు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 4.6%, రెండో త్రైమాసికంలో 5.2%, మూడో త్రైమాసికంలో 5.4%, నాలుగో త్రైమాసికంలో 5.2 శాతంగా అంచనా వేశారు. వృద్ధి ఇలా.. ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటును గత అంచనాలను అనుగుణంగా 6.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగించాలని ఎంపీసీ నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. వృద్ధిరేటు తొలి త్రైమాసికంలో 8%, రెండో త్రైమాసికంలో 6.5%, మూడో త్రైమాసికంలో 6%, నాలుగో త్రైమాసికంలో 5.7 శాతంగా అంచనా వేశారు.

### హోంలోన్‌లకు అనువైన సమయమేనా?

వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించిన నేపథ్యంలో తొలిసారి హోంలోన్ తీసుకునేవారికి పరిస్థితులు ఇప్పుడు అనుకూలంగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ప్రస్తుతానికి చాలా బ్యాంకుల్లో వడ్డీరేట్లు సింగిల్ డిజిట్లలోనే కొనసాగుతాయని తెలిపారు. ప్రస్తుతం గృహరుణ వడ్డీరేట్లు మెజారిటీ బ్యాంకుల్లో 8.7-9.75 శాతం మధ్య ఉన్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆర్‌బీఐ రేట్లను పెంచితే వడ్డీరేట్లు డబుల్ డిజిట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థల్లో నిరంతర అనిశ్చితులు కొనసాగుతున్నాయని దాస్ తెలిపారు. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై కూడా ఉంటుందని చెప్పారు. అదే జరిగితే ఆర్‌బీఐ అందుకనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ పరపతి విధాన సమీక్షల్లో రేట్ల పెంపును కొట్టిపారేయలేమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఆరోగ్యం- మహాభాగ్యం

## చిట్టి మనసుల్లో కలతలొద్దంటే..



కమలకు ఇద్దరు పిల్లలు పుట్టారనే సంతోషం నాలుగేళ్లకే ఆవిరైపోయింది. ఒకరి బొమ్మలు మరొకరితో పంచుకోకపోవడం, ఇద్దరూ ఎదుటివారిపై అసూయతో నిత్యం గొడవపడటం, నువ్వెందుకు వచ్చావ్..అనే స్థాయికి చేరింది వారి ప్రవర్తన. దీన్ని మొగ్గలోనే తుంచాలంటున్నారు నిపుణులు. వారిమధ్య బాల్యం నుంచే ప్రేమానుబంధాల్ని పెంచాలంటున్నారు. మొదటి బిడ్డను తల్లిదండ్రులు అపురూపంగా చూసుకుంటూ అడిగిందల్లా అందించి ప్రేమను పంచుతారు. అమ్మానాన్న ప్రేమ మొత్తం తనదే అనే భావనలో వారు పెరుగుతారు. అకస్మాత్తుగా తనకు, తల్లిదండ్రులకు మధ్య వచ్చిన మరొకరిని ప్రేమించలేరు. అలాకాకుండా రెండోసారి గర్భందాల్చినప్పుడు మొదటి సంతానాన్ని తల్లి మానసికంగా ముందుగానే సిద్ధం చేయాలి. త్వరలో తమ్ముడు లేదా చెల్లి పుడతారనీ, ప్రేమగా చూసుకోవాలనీ చెప్పాలి. తమ కుటుంబంలోకి రాబోతున్న పాపాయిని అందరం ప్రేమించాలనే అవగాహన కలిగించాలి. అయితే అప్పుడే పుట్టిన పాపాయిని తల్లి అపురూపంగా చూసుకోవడం, తనదనుకున్న ఆ ఒడిలో మరొకరుండటం మొదటి బిడ్డ తేలికగా తీసుకోవడం కష్టం. తన మనసునిండా అసూయ, కోపం, బాధ నిండుతాయి. ఒంటరితనానికి గురవుతారు. ఆ సమయంలోనే జాగ్రత్తగా ఆ పసి మనసుని సమన్వయం చేయాలి. బుజ్జాయిని జాగ్రత్తగా చూసుకోవాలనే అవగాహన కలిగించాలి.

### పంచుకోవడం..

తల్లిదండ్రులు ఇద్దరినీ సమానంగా చూడాలి. అలాకాకుండా చిన్నవాళ్లను దగ్గరకు తీసుకొని పెద్దపిల్లలపై కోపాన్ని ప్రదర్శించకూడదు. ఇలా చేస్తే వారి మనసులో ఎదుటివారిపై ద్వేషం పెరిగే ప్రమాదం ఉంది. తమ బొమ్మలు, వస్తువులు, కథల పుస్తకాలను వారితో పంచుకోవడానికి ఇష్టపడరు. రెండో సంతానం పుట్టడం వల్లే తనకు చెందాల్సినవన్నీ అవతల వారికీ చేరుతున్నాయనే ఆలోచన పెద్దవాళ్లలో మొదలవుతుంది. తల్లిదండ్రులు ఇద్దరినీ దగ్గరకు తీసుకోవడం, సమానంగా బొమ్మలు కొనివ్వడం, ప్రేమగా కథలు చెప్పడం, ఒకరితో మరొకరిని పోల్చకుండా మాట్లాడటం వంటివన్నీ తోబుట్టువుల మధ్య ప్రేమను చిగురించేలా చేస్తాయి.

## కండిషనర్ ఇలా కూడా!

కొన్ని ఉత్పత్తులు గడువు దాటితే ఏం చేయాలో తెలియదు. దీంతో చెత్తబుట్ట పాలు చేస్తాం. అలాంటి వాటిల్లో కండిషనర్ ఒకటి. కానీ దీన్ని ఎన్నో రకాలుగా తిరిగి ఉపయోగించుకోవచ్చని తెలుసా? పొడిబారిన పాదాలు, పగుళ్లా? రాత్రిపూట ఈ కండిషనర్ రాసి మృదువుగా మర్దనా చేయండి. తడి ఆరాక సాక్సులు వేసుకొని పడుకొంటే సరి. ఓ వారం ఇలా చేస్తే పాదాల చర్మాన్ని మృదువుగా మార్చడమే కాదు.. పగుళ్లూ తగ్గుతాయి. దీన్ని చేతివేళ్ల సంరక్షణకీ ఉపయోగించొచ్చు. వేళ్లు అందంగా కనిపించడానికి క్యుటికల్స్, గోళ్లు తొలగిస్తుంటాం కదా! దానికి 5 నిమిషాల ముందు కండిషనర్ పట్టించి, మృదువుగా మర్దనా చేయండి. తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసి మానిక్యూర్ చేసుకుంటే సరి. పని తేలిక అవుతుంది. బిగుతుగా అయిన గాజులు, ఉంగరాలను తీయడానికి సబ్బు నురగను ఉపయోగిస్తాం కదా! పాత కండిషనర్‌ని వాడినా పని తేలిక అవుతుంది. గట్టిగా మారిన గడియలు, సరిగా పనిచేయని జిప్‌లకి దీన్ని రాయండి. తిరిగి గాడిలో పడతాయి. కళ తప్పిన చెప్పులు, బూట్లను ఈ కండిషనర్‌లో ముంచిన వస్త్రంతో తుడిచి చూడండి. తిరిగి మెరవడమే కాదు.. త్వరగా లెదర్ పాడవదు కూడా. దీంతో స్టవ్, ట్యాపులు, సింకు వంటివీ శుభ్రం చేయొచ్చు.



పిల్లల పెయింట్ బ్రష్‌లు ఒక్కోసారి గట్టి పడి పనికిరాకుండా పోతాయి. వాటిని ఈ కండిషనర్ కలిపిన గోరువెచ్చని నీటిలో నానబెట్టి చూడండి. తిరిగి ఎంచక్కా వాడుకోవచ్చు.



## పేను కొరుకు సమస్యకు వెల్లుల్లి

కొంత మంది మహిళల్లో పోషకాహార లోపం, కాలుష్యం కారణంగా జుట్టు పల్చబడుతుంది. కొందరిలో పేను కొరుకు సమస్య ఉంటుంది. వీటికి ఇంట్లో దొరికే పదార్థాలతోనే చెక్ చెప్పొచ్చు అంటున్నారు నిపుణులు...బంగాళదుంప, వెల్లుల్లి... పేను కొరికి, జుట్టు పలుచపడిన చోట బంగాళాదుంప, వెల్లుల్లి రసం మిశ్రమాన్ని దూదితో రుద్దాలి. చివరిగా కాఫీపొడి, నిమ్మరసం కలిపిన మిశ్రమాన్ని రాసి ఆరాక కడిగేయాలి. ఇలా వారానికి నాలుగు సార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

ఒత్తైన జుట్టు కోసం...ఒక కప్పు ఆలివ్ లేదా కొబ్బరి నూనెలో పది వెల్లుల్లి రెబ్బలు బరకగా దంచి వేయాలి. దీనిని ఐదునిమిషాలు మరిగించి చల్లారిన తర్వాత తలకు పట్టించాలి. రెండు గంటల తర్వాత గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికోసారి చేస్తే కురులు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి. వెల్లుల్లిలో ఉండే బి1, బి2, యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గిస్తాయి. చుండ్రు నివారణకు... రెండు ఉల్లిపాయలు, నాలుగు వెల్లుల్లి రెబ్బలు, ఒక స్పూన్ మెంతులను మిక్సీ పట్టాలి. దాన్ని కప్పు కొబ్బరి నూనెలో వేసి ఐదు నిమిషాలు స్టౌ పై పెట్టి మరిగించాలి. చుండ్రు నివారణకు, పొడవైన కురుల కోసం దీనిని వారానికి రెండుసార్లు రాస్తే సరి.

# పీటర్, ప్రమీల దంపతులు క్రైస్తవ కుటుంబాలకు ఆదర్శం





- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.
- ప్రమీల అంతిమ యాత్రలో పాల్గొని నివాళు లర్పించిన సాబీర్.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/7 సెప్టెంబర్/ అక్షరం న్యూస్:

సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు , ప్రజల మధ్య సోదరభావాన్ని నింపేందుకు యేసుక్రీస్తు బోధనలను ప్రచారం చేస్తూ తమవంతు కృషిని కొనసాగించిన దివంగతులు కోరి జాన్ ఫీటర్, జయ ప్రమీలాలు క్రైస్తవ కుటుంబాలకు ఆదర్శమని, నేటితరం వారి అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. రామవరం ఏరియా వన్నందాస్ గడ్డకు చెందిన చర్చి కమిటీ మాజీ నాయకుడు, జాన్ పీటర్ సతీమణి, చర్చి స్త్రీలమైత్రం సంఘం నాయకురాలు జయ ప్రమీల (60) అనారోగ్యంతో మృతిచెందింది. మృతదేహాన్ని సందర్శించిన అయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతమయాత్రలో 'కాఫిన్'ను మోసి వారి కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్ని చాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కమ్యూనిస్టుని ఫీటర్ కుటుంబం ఆదరించేవారని, ప్రజా ఉద్యమాలను ప్రోత్సహించేవారన్నారు. నివాళు లర్పించిన వారిలో సిపిఐ నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, గుత్తుల శ్రీనివాస్, ఎస్ వి రామారావు, తొగరు నరేంద్ర కుమార్, ఆది మల్లయ్య, కడారి మల్లేష్ తదితరులు వున్నారు.

## ప్రజాసమస్యలను గుర్తించి పరిష్కరంకోసం కృషి చేయాలి

- 8న జరిగే కలెక్టర్ కార్యాలయం ధర్నాకు తరలిరావాలి
- 9న కొత్తగూడెం క్లబ్బులో సిపిఐ మాజీ జాతీయ నేత సురవరం సంస్మరణ సభ
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/7 సెప్టెంబర్/ అక్షరం న్యూస్:

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిస్కారానికి కమ్యూనిస్టు కార్యకర్తలు కృషి చేయాలని, అవసరమైతే ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో ఆదివారం జరిగిన సిపిఐ లక్ష్మీదేవిపల్లి మండల సమితి సమావేశానికి అయన ముఖ్య అతిధిగా హరి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిస్కారంకోసం స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారని, మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పోడు భూముల సమస్య, ఫారెస్టు అధికారుల దాడులు తదితర డిమాండ్ల పరిస్కారంకోసం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జరగనున్న కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పార్టీలకతీతంగా జిల్లా నలుమూలల నుంచి వ్యవసాయ కార్మికులు, పార్టీ, ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. 9న కొత్తగూడెం క్లబ్బులో సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్మరణ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో మండల నాయకులు దీటి లక్ష్మి పతి, కె రత్నకుమారి, మామిడాల ధనలక్ష్మి, నూనావత్ గోవిందు, కంటెం శ్రీనివాస రావు, శాపావత్ రవి, కళ్లెం పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాళోజి సాహిత్య పురస్కారాన్ని అందుకున్న కవి కొత్త అనిల్ కుమార్



కరీంనగర్ /సెప్టెంబర్ 07 (అక్షరం న్యూస్)

హైదరాబాధ్ లోని బిర్లా ప్లానిటోరియం భాస్కర ఆడిటోరియంలో త్రివర్ణ ఫౌండేషన్ – ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన మహాకవుల జయంతోత్సవం, దక్షిణ భారత భాషా కవి సమ్మేళనంలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి చేతుల మీదుగా కరీంనగర్ కు చెందిన కవి కొత్త అనిల్ కుమార్ కు ప్రజాకవి కాళోజి నారాయణరావు సాహిత్య పురస్కారాన్ని, అన్నాడి గజేందర్ రెడ్డి కి గుర్రం జాషువా పురస్కారాన్ని ప్రధానం చేశారు. ముఖ్యతిథి సిధారెడ్డి మాట్లాడుతూ మహకవులను గుర్తు చేసుకుంటూ " తడి లేని వారు కవులు కాలేరు.కంటి చెమ్మ లేని వాడు కవి కాదు. దాశరథి,కాళోజి, సినారె,జాషువా ,గురజాడ ల జయంతి జరపడం స్ఫూర్తిదాయకం " అని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆచార్య కొలకూరి ఇనాక్, ఎమ్మెల్సీ ఇక్బాల్, బైస దేవదాస్, దొమ్మటి శంకర్ తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

## కవి అనిల్ కుమార్ కు కాళోజీ పురస్కారం



కరీంనగర్ /సెప్టెంబర్ 07 (అక్షరం న్యూస్)

హైదారాబాద్ కు చెందిన త్రివర్ణ ఫౌండేషన్ వారు ప్రతి ఏటా అందిస్తున్న సాహిత్య పురస్కారాల్లో భాగంగా కాళోజీ నారాయణరావు పేరు మీద ప్రధానం చేయనున్న సాహిత్య పురస్కారాన్ని ఈ సారి కరీంనగర్ కు చెందిన కవి,రచయిత కొత్త అనిల్ కుమార్ కు ఇవ్వనున్నట్లు త్రివర్ణ ఫౌండేషన్ కన్వీనర్ ,జానపద అకాడమీ, అధికార భాషా సంఘం, ఆంధ్రప్రదేశ్ పూర్వ అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.ఇప్పటి వరకు మూడు కవితా సంపుటాలు రచించిన కొత్త అనిల్ కుమార్ ప్రస్తుతం సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగా సాహితీ సేవలు అందిస్తున్నారు.వారికి ఈ పురస్కారం రావడం పట్ల నంది శ్రీనివాస్,గాజుల రవీందర్, దొమ్మటి శంకర్,కాండూరి వేంకటేశ్వర్లు, సాయిల్ల శ్రీనివాస్, సజ్జన కమలాకర్,శ్రీనివాస చారి, ఏ.శ్రీనివాస్ లు కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

## అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు

కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్0 7/అక్షరం న్యూస్:

జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి మౌనిక తన భర్త మిడిదొడ్డి శివాజీ, అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలని చెప్పి మానసికంగా, శరీరకంగా హింసిస్తున్నారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

## పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన మేడిపల్లి సత్యం



చొప్పదండి /కరీంనగర్, సెప్టెంబర్ 07( అక్షరం న్యూస్)

ఆదివారం రోజున చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పలు బాధిత కుటుంబాలను పరామర్శించినారు.చొప్పదండి మండలం వెదురుగట్ట గ్రామంలో ఇటీవల పాము కాటుతో మృతి చెందిన చిన్నారి దీప్తిక కుటుంబ సభ్యులను, పట్టణానికి చెందిన మైనారిటీ నాయకులు మహమ్మద్ చాంద్ పాషా తల్లిగమరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం చాకుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంకిడి మాధవరెడ్డి గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అలాగే భూపాలపట్నం మాజీ సర్పంచ్ తోడేటి డేవిడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ మాల మహానాడు చొప్పదండి పట్టణ అధ్యక్షుడు గా సంబోజీ సునీల్



చొప్పదండి /కరీంనగర్ ,సెప్టెంబర్ 07( అక్షరం న్యూస్)

చొప్పదండి పట్టణానికి చెందిన సంబోజి సునీల్ తెలంగాణ మాల మహానాడు చొప్పదండి టౌన్ అధ్యక్షుడిగా నియామకం అయ్యారు .మాల మహానాడు రాష్ట్రీయ అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు కాడ శంకర్ నియామకపు చేసి చొప్పదండి తెలంగాణ మాల మహానాడు పట్టణ అధ్యక్షుడిగా ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా సంబోజి సునీల్ మాట్లాడుతూ మాల కులస్తులకు ఎక్కడైనా అన్యం జరుగుతే ముందుండి ప్రశ్నిస్తానని, రాజకీయంలో కూడా మాల యువతి,యువకులను ముందుకు తీసుకువెళ్లే విధంగా కృషి చేస్తానని,నాకు అప్పగించిన బాధ్యతను సమన్యాయంతో పాటిస్తాను అందరితో కలిసి ముందుకు తీసుకు వెళ్లే విధంగా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు కాడ శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు, చొప్పదండి నియోజకవర్గం ఇంచార్జ్ కుసుమల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ గుర్తించి బాధితునికి అందజేత

**ఇల్లందకుంట ఎస్సై క్రాంతి కుమార్**



కరీంనగర్/ఇల్లందకుంట/సెప్టెంబర్ 07/అక్షరం న్యూస్: ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన నాగపురి ప్రవీణ్ తన మొబైల్ ఫోన్ హనుమకొండలో పోయిందని ఫిర్యాదు ఇవ్వగా ఇల్లందకుంట ఎస్సై క్రాంతి కుమార్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటి రిజిస్టర్) సిఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ గుర్తించి ప్రవీణ్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోయిన, ఎవరైనా దొంగతనం చేసిన వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

## రక్తదానం చేసి ప్రాణం కాపాడిన యువకుడు



కరీంనగర్/హుజురాబాద్/సెప్టెంబర్ 07/అక్షరం న్యూస్:

ఆపదలో ఉన్న ఒక ప్రాణాన్ని కాపాడేందుకు పట్టణంలోని యువకుడు ముందుకు వచ్చి రక్తదానం చేశాడు. వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మడత గ్రామానికి చెందిన బండారి దివ్య అనే యువతీ డెంగ్యూ జ్వరంతో రక్త కణాలు పూర్తిగా తగ్గిపోయి (పదివేలకు పడిపోయాయి)ప్రాణాపాయ స్థితిలో ఉంది. డాక్టర్లు వెంటనే రక్త కణాలు ఎక్కించాలని చెప్పి బంధువులకు సూచించారు. దివ్య కు ఏ పాజిటివ్ డోనర్ అవసరం కాగా దివ్య బంధువులు ప్రముఖ సామాజికవేత్త సబ్బాని వెంకట్ ఏర్పాటు చేసిన బ్లడ్ గ్రూపులో అర్జెంట్ గా రక్త కణాలు కావాలని పోస్ట్ చేయగా గ్రూప్లో ఉన్న హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఉమ్మడి రాము అనే యువకుడు వెంటనే స్పందించి అందులో ఉన్న ఫోన్ నెంబర్ కి కాల్ చేసి కరీంనగర్ లోని చల్మెడ ఆనందరావు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న దివ్య కు రక్త కణాలను డొనేట్ చేసి ప్రాణాన్ని కాపాడారు. దివ్య కుటుంబ సభ్యులు రామును అదేవిధంగా బ్లడ్ గ్రూప్ నడిపిస్తున్న సబ్బానీ వెంకట్ కు కుటుంబ సభ్యులు, పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్0 7/అక్షరం న్యూస్:

ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ అరబాటి గోపాల రావు (68) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామానికి చెందిన అరబాటి గోపాల్ రావు ఆదివారం రోజున పొలం దగ్గర గడ్డి కోసుకొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి పొలం దగ్గర చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు జమ్మికుంట టౌన్ సిఐ ఎస్ రామకృష్ణ గౌడ్ తెలిపారు. మృతుడి భార్య అరబాటి శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# వరద కాలువ సమస్యను పరిష్కరించడంలో విఫలమైన మున్సిపల్ అధికారులు



- జమ్మికుంట మున్సిపాలిటీకి వచ్చిన మూడు కోట్ల నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి.
- బిజెపి పట్టణ అధ్యక్షులు కోలకాని రాజు
- అంబేద్కర్ కాలనీ సందర్శించి ,అభివృద్ధిపై ఇంత నిర్లక్ష్యమా అని ప్రశ్నించిన బిజెపి నాయకులు.

కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 07/ అక్షరం న్యూస్:

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డ్ లోని అంబేద్కర్ కాలనీ మురుగు కాలువ నిర్మాణం పూర్తి చేయక పోవడం తో శనివారం కురిసినా చిన్న వర్షానికే వరద ప్రవాహం పెరిగింది, మున్సిపల్ అధికారులు ఇంటి పనులు , నల్ల పనులు ముందస్తుగానే ముక్కు పిండి వసూలు చేసినా ఆ నిధులు ఈ పేద ప్రజలపై ఖర్చు చేయడానికి ఎందుకు నిర్లక్ష్యం అని బీజేపీ పట్టణ అధ్యక్షులు కోలకాని రాజు అధికారులను ప్రశ్నించారు. ఇంటి పన్నుల వసూలులో జమ్మికుంట మున్సిపాలిటీ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని గొప్పలు చెప్పిన మునిసిపల్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం నుండి మూడు కోట్ల రూపాయలు స్పెషల్ గ్రాంట్ నిధులు వచ్చినప్పటికీ ఎందుకు వరద ముంపు ప్రాంతాలలో అభివృద్ధి పనులు ఎందుకు చేయడం లేదని కొలకాని రాజు అన్నారు .మున్సిపాలిటీకి వచ్చిన మూడు కోట్ల రూపాయల నుండి ఏ ఏ పనులకి ఎంత ఖర్చు పెట్టారో శ్వేత పత్రం విడుదల చేయాలని, ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా భారతీయ జనతా పార్టీ జమ్మికుంట పట్టణ శాఖ ఆధ్వర్యంలో వివిధ నిరసన కార్యక్రమాలు చేసి, వినతి పత్రాలు ఇచ్చినా కనీసం మున్సిపల్ అధికారులలో చలనం లేదని ఎద్దేవ చేశార. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు తక్షణమే అభివృద్ధి కార్యక్రమాలపై చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ డిమాండ్ చేస్తుందని అన్నారు. లేని పక్షంలో స్థానిక ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, బచ్చు శివన్న, గిరవేన విజేందర్, ఉడుగుల మహేందర్, వేముల జగన్, ఎగ్గని చందు, ఆకుల పోషయ్య, మ్యాదరి శంకర్, సిరియాల విజయ్, అంబేద్కర్ కాలనీ ప్రజలు కనుమల లక్ష్మి, సులోచన, అశ్విని, భోగం లక్ష్మి, ఓదేన్న, శోభ, విమల, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్‌లో జోరువాన..చెరువుల్ని తలపించిన రోడ్లు

- అండర్ బ్రిడ్జి వద్ద వరదలో 2 బస్సులు
- ప్రయాణికులను తాడు సాయంతో బయటకు తీసుకొచ్చిన సిబ్బంది



హైదరాబాద్ సెప్టెంబరు 7అక్షరం న్యూస్:

వరంగల్‌లో ఆదివారం ఉదయం ఆకస్మికంగా కురిసిన కుండపోత వర్షంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు కాలనీలు జలమయం కాగా రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ముఖ్యంగా వరంగల్ నగరంతో పాటు ఖిలా వరంగల్ మండలాల పరిధిలో భారీ వర్షం పడగా.. మిగతా మండలాల్లో ఓ మోస్తరు వర్షపా తం నమోదైంది. బాలసముద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి నీరు చేరడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## అండర్‌బ్రిడ్జి వద్ద చిక్కుకున్న బస్సులు

అండర్ రైల్వే బ్రిడ్జి కింద రెండు ఆర్టీసీ బస్సులు వరదనీటిలో చిక్కుకున్నాయి. హఠాత్తుగా బస్సు ఆగిపోవడంతో అందులో ఉన్న 30 మంది ప్రయాణికులు ప్రాణభయంతో హాహాకారాలు చేశారు. సమాచారం అందుకున్న నగర పాలక సంస్థ మాన్సూన్ బృందాలు, పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇక భారీ వర్షానికి హనుమకొండ చౌరస్తా జలమయమైంది. ప్రధాన రోడ్లతో పాటు సమీపంలోని పలు కాలనీలకు వరదనీరు పెద్దఎత్తున చేరింది. ఇటు,హనుమకొండ చౌరస్తాలో ప్రధానరోడ్డు వెంబడి మోకాళ్ల లోతు వరద పొంగి ప్రవహించడంతో రోడ్లన్ని చెరువుల్ని తలపించాయి.

## శ్రీశైలం ప్రాజెక్టుకు పెరిగిన వరద

శ్రీశైలం ప్రాజెక్టుకు ఆదివారం స్వల్పంగా వరద పెరిగింది. ప్రాజెక్టులోకి 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మూడు గేట్ల ద్వారా 82,986 క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,078 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 30 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదవుతోంది. ఇక, జూరాల ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1.20లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు ఈ సీజన్‌లో ఆదివారం మూడోసారి తెరుచుకున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను, 589.70 అడుగులకు చేరుకుంది.

# పిల్లలు లేరని మూడో వివాహం.. కోరిక తీరింది గానీ చివరకు ప్రాణమే పోయింది..

మధ్యప్రదేశ్ సెప్టెంబరు 7అక్షరం న్యూస్:

అతడికి అప్పటికే ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య వదిలేయడంతో రెండో వివాహం చేసుకున్నాడు. అయితే రెండో భార్యకు పిల్లలు లేకపోవడంతో చివరకు ఆమె చెల్లెలిని మూడో వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లకు వారికి సంతానం కలిగింది. పిల్లలు కావాలనే అతడి కోరిక అయితే తీరింది గానీ.. వారి బాగోగులు చూసుకుని మురిసిపోయే అవకాశం లేకుండా పోయింది. చివరికి మూడో భార్య చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. ఇంతకీ అసలు ఏం జరిగిందంటే..

మధ్యప్రదేశ్ భోపాల్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. అనుప్పూర్ జిల్లాలోని సకారియా గ్రామానికి చెందిన భయ్యాలాల్ రాజక్ (60) మొదటి భార్య విడిచి వెళ్లిపోయింది. దీంతో కొన్నేళ్లకు అతను గుడ్డి బాయి అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. అయితే రెండో భార్యకు పిల్లలు కలగలేదు. ఎలాగైనా వారసులు ఉండాలనే ఉద్దేశంతో భయ్యాలాల్.. మూడో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.ఈ క్రమంలో చివరకు గుడ్డి బాయి చెల్లెలు మున్నీని చేసుకోవాలని ఫిక్స్ అయ్యాడు. భార్యతో పాటూ రెండు కుటుంబాల వారూ అంగీకరించడంతో భయ్యాలాల్‌తో మున్నీ వివాహం జరిగిపోయింది. వివాహమైన కొన్నేళ్లకు మున్నీకి ఇద్దరు



పిల్లలు జన్మించారు. తన కోరిక నెరవేరడంతో భయ్యాలాల్ ఎంతో సంతోషించాడు. అయితే ఆ సంతోషం ఎంతో కాలం నిలవదని గుర్తించలేకపోయాడు. ఈ క్రమంలో మున్నీకి నారాయణ్ దాస్ అలియాస్ లాలూ అనే వ్యాపారితో పరిచయం ఏర్పడింది.


ఈ పరిచయం కాస్తా కొన్నాళ్లకు వివాహేతర సంబంధానికి దారి తీసింది. మున్ని తన భర్తకు తెలీకుండా లాలూను కలుస్తుండేది. అయితే కొన్నాళ్ల తర్వాత ఆ ఇద్దరూ కలిసి భయ్యాలాల్ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో లాలూ.. ధీరజ్ కోల్ అనే వ్యక్తిని సంప్రదించాడు. చివరకు ముగ్గురూ కలిసి ఆగస్టు 30న రాత్రి భయ్యాలాల్ హత్యకు ప్లాన్ చేశారు. ఆ రోజు రాత్రి నిర్మాణంలో ఉన్న ఇంట్లో భయ్యాలాల్ పడుకుని ఉన్నాడు. వేకువజాము 2 గంటల ప్రాంతంలో లలూ, ధీరజ్ కలిసి భయ్యాలాల్‌ను ఇనుప రాడ్డుతో తలపై కొట్టి చంపేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని ఒక సంచిలో చుట్టి, రాళ్లు కట్టి బావిలో పడేశారు.మరుసటి రోజు ఉదయం భయ్యాలాల్ రెండో భార్య గుడ్డి బాయి ఏదో పని మీద అటుగా వెళ్లి బావిలో (%ణమ్మ్న ఎశీఎ అఅ షవశ్రీశ్రీ%) చూడగా ఏదో తేలుతున్నట్లు కనిపించింది. భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. చివరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు అవడంతో చనిపోయాడని పోస్టుమార్టం రిపోర్టులో తేలింది. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 36 గంటల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో ముగ్గురిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కస్టడీకి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం కలిగించింది.

# సపోటా ఇలా తింటే నమ్మలేని ఆరోగ్య ప్రయోజనాలు.. శరీరంలో అద్భుతాలు చూస్తారు..!



ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. సపోటా స్ట్రెస్‌ను కూడా సమర్థవంతంగా పనిచేస్తుంది. పోటాలో వుండే యాంటీఆక్సిడెంట్లు, టానిన్లు వాపు- నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. సపోటాలో ఉండే విటమిన్ ఎ, బి, ఇ చర్మ ఛాయను మెరుగుపరుస్తాయి. సపోటా నేరుగా తినవచ్చు లేదా జ్యూస్ కూడా తీసుకోవచ్చు. సపోటా ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తుంది. కంటి ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుంది. సపోటా పండ్లలోని విటమిన్ ఎ, సి కంటికి మేలు చేస్తాయి. మంచి దృష్టిని రక్షిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలోని విష వ్యర్థాలను తొలగించి గుండెను రక్షించడంలో ఇది మేలు చేస్తుంది. శక్తిని ఇస్తుంది. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతుంది. జీర్ణ ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుంది. ఇది కడుపు సంబంధిత సమస్యలకు తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. సపోటాలో ఫైబర్, విటమిన్ బితో పాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ వంటి వ్యాధులను నివారిస్తాయి. సపోటాలలో సుక్రోజ్ ఎక్కువగా ఉంటుంది. ఇది తక్షణ శక్తిని ఇస్తుంది. పని చేసి అలసిపోయిన వారు ఈ పండ్లను తింటే ఫుల్ ఎనర్జీ వస్తుంది. సపోటా రెగ్యులర్‌గా తినడం వల్ల చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. సపోటా స్ట్రెస్‌ను కూడా సమర్థవంతంగా పనిచేస్తుంది. పోటాలో వుండే యాంటీఆక్సిడెంట్లు, టానిన్లు వాపు- నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. సపోటాలో ఉండే విటమిన్ ఎ, బి, ఇ చర్మ ఛాయను మెరుగుపరుస్తాయి. సపోటా నేరుగా తినవచ్చు లేదా జ్యూస్ కూడా తీసుకోవచ్చు. ఎముకలకు మేలు చేసే కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటి పోషకాలు సపోటాలో ఉన్నాయి. ఇవి ఎముకలను బలోపేతం చేస్తాయి. రోజూ సపోటా తింటే వృద్ధాప్యంలో ఎక్కువ మందులు వాడాల్సిన అవసరం ఉండదని నిపుణులు చెబుతున్నారు.. సపోటాలలోని ఫోలేట్, క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్, కాపర్, ఫాస్ఫరస్, సెలీనియం ఎముకలను దృఢపరుస్తుంది. గర్భిణీ స్త్రీలు ఉదయాన్నే సపోటా తింటే చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# మీ వయస్సుకి సరిపడా నీళ్లు మీరు తాగుతున్నారా..? ఎన్ని లీటర్ల నీళ్లు తాగాలో తెలుసా..?



మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే తగినన్ని మోతాదులో నీరు తాగడం చాలా అవసరం. కానీ ఒక్కో వ్యక్తికి ఎంత నీరు అవసరమో వారి వయస్సు, బరువు, చేసే పనుల మీద ఆధారపడి ఉంటుంది. చాలా మంది ఈ విషయాన్ని పట్టించుకోకుండా తక్కువ నీరు తాగుతూ ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు.


వీ మన శరీరంలో సుమారుగా 60 శాతం వరకు నీరు ఉంటుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను అదుపులో ఉంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, హానికరమైన పదార్థాలను బయటకు పంపడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అలసట, తలనొప్పి, మూడ్ స్వింగ్స్ లాంటి సమస్యలకు కూడా తగినంత నీరు తాగకపోవడం ఒక కారణం కావచ్చు. 1 నుంచి 8 ఏళ్ల వయస్సు పిల్లలకు రోజుకు సుమారుగా 1.3 నుంచి 1.7 లీటర్ల మధ్య నీరు అవసరం. వారు చురుకుగా ఆడుకుంటారు కాబట్టి శరీరం తేమగా ఉండడం కోసం తగినంత నీరు తాగించాలి. 9 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు విద్యార్థులు రోజుకి కనీసం 2 నుండి 2.5 లీటర్లు నీరు తాగాలి. చదువులో శ్రద్ధ పెట్టడానికి, శరీరంలో శక్తిని కాపాడుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు వారు రోజుకి 2.5 నుండి 3 లీటర్ల వరకు నీటిని తీసుకోవాలి. ఎక్కువ శారీరక శ్రమ చేసే వారు.. ఎక్కువ వేడి వాతావరణంలో పనిచేసే వారు మరింత నీరు తాగాలి. ఇది శరీరంలోని నరాల పని తీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మహిళలు నెలసరి లేదా గర్భధారణ సమయంలో హార్మోన్లలో తేడాలు కనిపించడం సహజం. ఈ సమయంలో శరీరానికి ద్రవ పదార్థాల అవసరం పెరుగుతుంది. అందువల్ల రోజుకు కనీసం 3 లీటర్ల నీటిని తాగడం ద్వారా శరీరంలో డీహైడ్రేషన్ ను నివారించవచ్చు. 60 ఏళ్లు పైబడినవారు.. వయస్సు పెరిగే కొద్దీ దాహం అనిపించే స్వభావం తగ్గిపోతుంది. అందుకే తగినంత నీరు తాగకపోవడం వల్ల డీహైడ్రేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. కనీసం రోజుకు 1.5 నుండి 2 లీటర్ల వరకు నీరు తాగడం మంచిది. దాహం అనిపించకపోయినా కొన్ని గంటలకొకసారి తాగే అలవాటు చేసుకోవాలి.ఒక సాధారణ నియమం ప్రకారం.. ప్రతి కిలో శరీర బరువుకు కనీసం 30 మిల్లీలీటర్ల నీరు అవసరమవుతుంది. ఉదాహరణకు 60 కిలోల బరువు ఉన్న వ్యక్తికి దాదాపు 1.8 లీటర్ల నీరు అవసరం.నీరు తాగడానికి సరైన సమయాలుఉదయం లేచిన వెంటనే ఒక గ్లాస్.భోజనానికి 30 నిమిషాల ముందు.వ్యాయామం తర్వాత.పడుకునే ముందు కొద్దిగా నీరు.ఈ సమయాల్లో నీటిని తాగడం ద్వారా శరీరానికి తగిన తేమ అందుతుంది.

## విజయ్ తో ఏమి లేనప్పుడు అంత సిగ్గెందుకు పడుతున్నావ్ పాప..



అందాల భామ త్రిష కృష్ణన్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు స్టార్ హీరోల సరసన నటించి మెప్పించిన త్రిష.. లేడి ఓరియెంటెడ్ సినిమాలకు బ్రాండ్ అంబాసిడర్ గా మారింది. చాలా గ్యాప్ తరువాత త్రిష.. తెలుగులో విశ్వంభర సినిమాతో రీఎంట్రీ ఇస్తుంది. దీంతో పాటు తమిళ్ లో కూడా అమ్మడు వరుస సినిమాలతో బిజీగా మారింది. ఇక ఇదంతా పక్కన పెడితే.. అమ్మడు వివాదాల ద్వారా మరింత ఫేమస్ అయ్యింది. గత కొంతకాలంగా త్రిష.. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తో రిలేషన్ లో ఉందని పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. ఇద్దరూ కలిసి వెకేషన్స్, టూర్స్ అంటూ ఎక్కడో ఒకచోట కెమెరా కంటికి కనిపిస్తూనే ఉన్నారు. దీంతో వీరిద్దరి మధ్య ఏదో ఉందని వార్తలు పుట్టుకొచ్చాయి. విజయ్, త్రిష త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని వార్తలు వినిపించాయి. కానీ, ముద్దుగుమ్మ మాత్రం అదేమీ లేదని చెప్పుకొచ్చింది. కానీ, వీరి రిలేషన్ ఏంటి అనేది ఇప్పటివరకు బయటపడలేదు.త్రిష పైకి చెప్పడం లేదు కానీ, కచ్చితంగా విజయ్ తో రిలేషన్ లో ఉందని మాత్రం ఎప్పటికప్పుడు నిరూపిస్తూనే ఉంది. తాజాగా సైమా అవార్డ్స్ లో త్రిష.. విజయ్ గురించి మాట్లాడింది. దుబాయ్ లో జరిగిన ఈ వేడుకకు త్రిష కూడా హాజరయ్యింది. ఇక స్టేజీపై అమ్మడిని పిలిచి.. విజయ్ ఫోటో చూపించడం జరిగింది. విజయ్ ఫోటో చూడగానే ఫ్యాన్స్ అరవడం మొదలుపెట్టారు. ఇక వాళ్లు అరుస్తుంటే త్రిష సిగ్గుపడడం ఎన్నో అనుమానాలకు దారితీసింది.ఇక ఈ ఈవెంట్ లో త్రిష.. విజయ్ గురించి మాట్లాడుతూ.. విజయ్ కొత్త ప్రయాణానికి శుభాకాంక్షలు. అతని కల ఏదైనా, అది నిజమవుతుంది ఎందుకంటే అతను దానికి అర్హుడు' అంటూ చెప్పుకొచ్చింది. ఇక ప్రస్తుతం త్రిష చేసిన వ్యాఖ్యలు, ఆమె అలా సిగ్గుపడడం పై అభిమానులు మరోసారి విజయ్ తో పెళ్లి వార్తలు బయటకు తీశారు. అతనితో ఏమి లేనప్పుడు పేరు చెప్పగానే అంతా సిగ్గు పడడం దేనికి పాప అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి వీరి మధ్య ఏం జరుగుతుంది అనేది ముందు ముందు తెలుస్తుందేమో చూడాలి.

## కొడుకు తొలి బర్త్డే.. హీరో నితిన్ ఎమోషనల్ పోస్ట్



టాలీవుడ్‌లో మంచి పేరు సంపాదించిన హీరో నితిన్ ) తన కొడుకు అవ్యుత్ తొలి పుట్టినరోజును పెద్దగా హడావుడి చేయకుండా, కుటుంబ సభ్యులు, దగ్గరి మిత్రులతో కలిసి ఆనందత్సోవాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారి అవ్యుత్ ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసి, “హ్యాపీ ఫస్ట్ బర్త్డే మై లిటిల్ ప్రిన్స్” అంటూ శుభాకాంక్షలు తెలిపాడు. అంతేగాక నా జీవితంలో విలువ కట్టలేని అమూల్యమైన కానుక ఇచ్చావంటూ భార్య శాలిని కి సైతం కృతజ్ఞతలు తెలిపాడు.ఇదిలాఉంటే ఇటీవల వరుసగా చిత్రాలు పరాజయం పాలవడంతో నితిన్ కెరీర్ కాస్త గాడీ తప్పడంతో ఇప్పుడు తన రానున్న సినిమాల పైనే పూర్తి దృష్టి సారించాడు. తనకు గతంలో ఇష్క్ సినిమాతో తన కెరీర్‌ను లైన్‌లో పెట్టిన మనం ఫేమ్ విక్రమ్ కుమార్ దర్శకత్వంలో గుర్రపు స్వారీ నేపథ్యంలో ‘స్వారీ’ అనే సినిమా చేస్తున్నాడు. ఇందులో హీరోయిన్‌గా పూజా హెగ్డే పేరు ఖరారైనట్లు సమాచారం.

# మదరాసి మూవీ రివ్యూ



సూపర్ స్టార్ రజనీకాంత్‌తో ఐదేళ్ళ క్రితం ‘దర్బార్’ తీసిన ఎ.ఆర్. మురుగదాస్ తెరకెక్కించిన తాజా తమిళ చిత్రం ‘మదరాసి’ అయితే ఇదే ఏడాది మురుగదాస్ హిందీలో సల్మాన్ ఖాన్ తో ‘సికిందర్’ మూవీనీ తీశాడు. అప్పటి రజనీకాంత్ సినిమానే కాదు... నిన్నటి సల్మాన్ ఖాన్ మూవీ సైతం బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దాంతో అందరూ మురుగదాస్ మీద కంటే కూడా ‘మదరాసి’లో హీరోగా నటించిన శివ కార్తికేయన్ మీదే హోప్స్ పెట్టుకున్నారు. గత దీపావళికి వచ్చిన శివకార్తికేయన్ ‘అమరన్’ సినిమా మూడు వందల కోట్ల గ్రాస్ ను వసూలు చేయడమే అందుకు కారణం. సో... ‘మదరాసి’ మురుగదాస్ మూవీగా కంటే శివ కార్తికేయన్ సినిమాగానే గుర్తింపు తెచ్చుకుంది. శుక్రవారం జనం ముందుకొచ్చిన ఈ సినిమాకు ఏ మాత్రమైనా ఓపెనింగ్స్ వచ్చాయంటే అవి శివ కార్తికేయన్ కారణంగానే!సినిమా వెబ్ సిరీస్

‘మదరాసి’ కథ విషయానికి వస్తే చాలా సింపుల్. ప్రశాంతంగా ఉండే తమిళనాడు రాష్ట్రంలో దేవుడు, మతం పేరుతో చిచ్చుపెట్టలేమని గ్రహించిన కొందరు అక్కడ గన్ కల్చర్ తేవడం ద్వారా ప్రయత్నిస్తారు. తద్వారా రాష్ట్రాన్ని అతలాకుతలం చేయాలని భావిస్తారు. ఆ కుట్రలో భాగంగా ఆరు ట్రక్కుల్లో తమిళనాడులోకి పవర్ ఫుల్ వెపన్స్ ను పంపుతారు. వాటి రవాణాను అడ్డుకోవడానికి ఎన్.ఐ.ఎ. అధికారులు తీవ్రంగా ప్రయత్నం చేస్తారు. వారిని దాటుకుని విరాట్ (విద్యుత్ జమ్వాల్), చిరాగ్ (షబీర్ కలరక్కల్) తమ సిండికేట్ అండతో తమిళనాడులోకి అడుగుపెడతారు. మానసిక అనారోగ్యంతో పదహారేళ్ళ పాటు మెంటల్ హాస్పిటల్ లో ఉన్న రఘురామ్ (శివ కార్తికేయన్) అనుకోకుండా ఈ ఆపరేషన్ లో భాగమవుతాడు. అతని ప్రియురాలు మాలతి (రుక్మిణీ వసంత్) కూడా ఈ ఆటలో పావుగా మారిపోతుంది. అక్రమ ఆయుధాలు తమిళనాడులో సరఫరా కాకుండా ఎన్.ఐ.ఎ. అధికారులు నిలువరింప గలిగారా? రఘు కు ఉన్న మానసిక సమస్య ఏమిటీ? దాని ద్వారా ఎన్.ఐ.ఎ. అధికారులు ఎలా లబ్ధిపొందారు? విలన్స్ ఉచ్చులో చిక్కుకున్న మాలతి అందులోంచి ప్రాణాలతో బయటపడిందా? అనేది మిగతా కథ.

తమిళనాడులో గన్ కల్చర్ ఇప్పటి వరకూ లేదని చాలా ఘంటాపథంగా దర్శకుడు మురుగదాస్ ఈ సినిమాలో చెప్పాడు. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలతో పోల్చదగ్గ స్థాయిలో గన్ కల్చర్ లేని మాట వాస్తవమే కానీ స్టార్ హీరో ఎం. జి. రామచంద్రన్ ను తోటి నటుడు ఎం.ఆర్. రాధ (నటి రాధిక తండ్రి) కాల్చింది గన్ తోనే కదా! సినిమా రంగంలోనే గన్ కల్చర్ ఉన్నప్పుడు అది లేదని ఈ సినిమాలో చెప్పడం హాస్యాస్పదంగా అనిపిస్తుంది. ఆ విషయాన్ని పక్కన పెడితే, అసలు మురుగదాస్ ఎంచుకున్న పాయింటే చాలా పేలవంగా ఉంది. ఆరు ట్రక్కుల్లో అక్రమ ఆయుధాలు స్టేట్ లోకి వచ్చిన తర్వాత అవి డిస్ట్రిబ్యూట్ కాకుండా ఆపడం కోసం ముక్కూ ముఖం తెలియని వ్యక్తిని ఈ ఆపరేషన్ కోసం ఎంచుకోవడం, అతని మానసిక పరిస్థితిని అడ్వాంటేజ్ గా తీసుకోవడం ఏ రకంగానూ కన్విన్సింగ్ గా అనిపించదు. సినిమా ప్రారంభం మొదలు, ముగింపు వరకూ ప్రతి సన్నివేశం కృత్రిమంగా ఉంది. కొత్తదనం ఉన్న సీన్ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. రెండు గంటల యాభై నిమిషాల నిడివి ఉన్న ఈ సినిమాలో హై పాయింట్ ఒక్కటంటే ఒక్కటి కూడా కనిపించదు. దాంతో ఇదసలు మురుగదాస్ డైరెక్ట్ చేసిన మూవీనేనా అనిపిస్తుంది. ఈ సినిమాను శివ కార్తికేయన్, రుక్మిణీ వసంత్ తమ నటనతో కాస్తంత నిలబెట్టే ప్రయత్నం చేశారు. విద్యుత్ జమ్వాల్, షబీర్ తెరపై స్టైలిష్ గా కనిపించారు. క్లయిమాక్స్ ఫైట్ లో విద్యుత్ జమ్వాల్ తన విశ్వరూపం చూపించాడు. ఆ యాక్షన్ ఎపిసోడ్ లెంగ్త్ కాస్తంత తగ్గించి ఉంటే బాగుంది. ఎన్.ఐ.ఎ. అధికారిగా బిజూ మీనన్ బాగా చేశాడు. నేపథ్యంలో వచ్చే రెండు పాటల సాహిత్యం అర్థవంతంగా ఉంది. అనిరుథ్ ఆర్.ఆర్. బాగుంది. గన్ కల్చర్ కు ప్రజలను దూరంగా ఉంచాలని చెప్పిన మురుగదాస్ స్టార్టింగ్ టు ఎడింగ్ దాన్నే హైలైట్ చేశారు. శివ కార్తికేయన్ అభిమానులకు ఈ సినిమా కొంత నచ్చవచ్చేమో కానీ మిగిలిన వారికి కష్టమే.

# అనుష్క నటించిన యాక్షన్ డ్రామా ‘ఘాటీ’ మెప్పించిందా

టాలీవుడ్‌లో మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచారు అనుష్కా శెట్టి. ఆమె సినిమా అంటే మినిమం గ్యారెంటీ అని ప్రేక్షకుల నమ్మకం. మిస్‌శెట్టి.. మిస్టర్ పోలిశెట్టి చిత్రం తర్వాత సినిమాలకు రెండేళ్ల గ్యాప్ ఇచ్చారు స్వీటీ. తాజాగా ఆమె నటించిన చిత్రం ఘాటి. క్రిష్ దర్శకుడు. విక్రమ్ ప్రభు కీలక పాత్రధారి. జగపతిబాబు, జాన్ విజయ్, చైతన్యరావు, రవీంద్ర విజయ్ ఇతర పాత్రధారులు. యువి. క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలపై వై రాజీవ్‌రెడ్డి, సాయి బాబా జాగర్లమూడి నిర్మించారు. ట్రైలర్, టీజర్‌లతో ఆసక్తి పెంచిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. మరీ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించిందనేది చూద్దాం.




కథ:

ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దులో జరిగే కథ ఇది. తూర్పు కనుమల్లో ఉన్న ప్రాంతాల్లో జీవించే అందరికీ జీవనాధారం గంజాయి సాగును దళారుల చెంతకు చేర్పడం. కాష్టాల నాయుడు (రవీంద్ర విజయ్), కుందుల నాయుడు (చైతన్య రావు) కింద అక్కడి వారంతా పని చేయాలి. అలా పని చేసే ఘాటీల్లో బావామరదళ్లు అయిన దేశీ రాజు (విక్రమ్ ప్రభు), శీలావతి (అనుష్క) ఆ పని మానేసి వేరే మార్గం చూసుకుంటారు. కొంతకాలానికి మళ్లీ అదే వృత్తిలోకి రావాల్సి వస్తుంది. అసలు వాళ్లు ఆ వృత్తికి ఎందుకు దూరమయ్యారు? మళ్లీ ఎందుకు ఘాటీల అవతారం ఎత్తారు? ఒక బాధితురాలిగా ఉన్న శీలావతి క్రిమినల్‌గా, లెజెండ్‌గా ఎలా ఎదిగింది. దాని వెనక ఏం జరిగింది? ఆమె టార్గెట్ ఏంటి అన్నది కథ.

**విశ్లేషణ**

తూర్పు కనుమల్లో జరిగే గంజాయి సాగు, అక్కడ ఘాటీల జీవనాధారం, వారి కష్టాల నేపథ్యంలో సాగే కథ ఇది. సినిమా ప్రారంభం, ఆర్టిస్ట్ పరిచయం, కథలోకి తీసుకెళ్లడం అంతా బాగానే సాగింది. హీరోహీరోయిన్లు తమ దారి వదిలి మళ్లీ పాత రూట్‌లోకి రావాలనుకున్నప్పటి నుంచి కథ ముందుకు కథల్లేదు. ఫస్టాఫ్ వరకూ, దేశిరాజు పాత్రను కిల్ చేసే దాకా బాగానే సాగిన అక్కడి నుంచి కథలో వేగం తగ్గింది. ఇంటర్వెల్ ట్విస్ట్, జగపతిబాబు, రాజు సుందరం పాత్రల నడక ప్రేక్షకుల ఊహకు అందేలా ఉన్నాయి. క్రిష్ రాసుకున్న అంశాలు బావున్నాయి. ఆ పాత్రలు బలమైనవిగా తెరపై కనిపించలేదు. కనుమల్నే తమ కనుసైగల్లో పెట్టుకున్న నియంతలపై పోరాటం అంటే, అదీ ఓ సామాన్య మహిళ చేసే పోరాటం అంటే ఎంతో ఎమోషన్ పండాలి, గూస్ బంప్స్ వచ్చేలా సీన్స్ ఉండాలి. ఇందులో అదెక్కడా కనిపించలేదు. అనుష్క చేసిన యాక్షన్ సీన్స్ మెప్పించాయి. గంజాయికి వ్యతిరేకంగా, దానిని నిర్మూలించాలనే సందేశంతో చింతకింది శ్రీనివాసరావు ఈ కథను రాశారు. దానిని రస్టిక్ అండ్ రా స్టైల్లో చూపించాలనుకున్నారు క్రిష్. ఫైనల్‌గా రెగ్యులర్ రివేంజ్ డ్రామాకు సమాజంలో ఓ సమస్య, సందేశం జోడించి చూపించారు. హృద్యంగా చెప్పడంలో ఫెయిల్ అయ్యారు. అప్పటిదాకా ఒక మార్గంలో ఉన్న ముఖ్య పాత్రధారులు ఒక్కసారిగా మారడం అనేది ప్రేక్షకులు యాక్సెప్ట్ చేసే విషయం కాదు. విలన్ పాత్రల ఎండింగ్ కూడా సోసోగా ఉంది.

**నటీనటులు, సాంకేతిక నిపుణులు పనితరు..**

అనుష్క నటన గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. తనదైన స్టైల్‌లో ఆమె చేసుకుంటూ వెళ్లిపోయారు. శీలావతి పాత్రకు తగ్గట్టు ఆమె మారిపోయారు. యాక్షన్ సన్నివేశాలకు ఆమె పడిన కష్టం తెరపై కనిపించింది. సినిమాను తన భుజాలపై మోసిందనేది అర్థమవుతుంది. కానీ అరుంధతీ, బాహుబలి చిత్రాల్లో అనుష్క పాత్రలో ఓ రాజసం ఉంటుంది. తెరపై ఆమె కటౌట్ చూస్తేనే హై మోమెంట్ వస్తుంది. ఈ సినిమాలో ఆమెకు యాక్షన్ ఎపిసోడ్ ఉన్నా, అవి అద్భుతంగా ఉన్నప్పటికీ ఎక్కడో అనుష్క తాలుక రాజసం, ఈజ్ మిస్ అయిన భావన కలిగింది. నటన, భావోద్వేగాలు పంచడంలో ఎక్కడా తేడా లేదు. అప్పీయరెన్స్‌లో ఏదో మిసింగ్. అనుష్కకు బావగా, దేశిరాజు పాత్రలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు మెచూర్డ్‌గా నటించాడు. ఆయన పాత్రకు పేరు పెట్టలేం. కుందల నాయుడుగా చైతన్య రావు పాత్ర ఓకే. అయితే ఓ మాదిరి పాత్రలు చేసే అతనికి విలన్‌గా బలమైన పాత్ర ఇవ్వడం అతని శక్తిని మించిన పాత్రలా అనిపించింది. నటనకు పెద్ద స్కోప్ లేకపోయినా రవీంద్ర విజయ్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంది. అతని మాటలు, ఎక్స్‌ప్రెషన్స్‌తో క్రూరమైన విలన్ అనిపించాడు. జగపతి బాబు, జాన్ విజయ్, రవీంద్ర విజయ్, రాజు సుందరం తదితరులు పరిధి మేర నటించారు. లారిస్సా, జిష్ణు సేన్ గుప్తా క్యారెక్టర్ ఎస్టాబ్లిష్‌మెంట్ బాగలేదు. సాయిమాధవ్ బుర్రా మాటలు అక్కడక్కడా పేలాయి. సంగీత దర్శకుడు సాగర్ నాగవెల్లి పాటలు, నేపథ్య సంగీతం బావున్నాయి. తూర్పు కనుమల అందాలను సినిమాటోగ్రఫర్ మనోజ్ రెడ్డి కాటసాని అద్భుతంగా చిత్రీకరించారు. వీఎఫ్‌ఎక్స్ మాత్రం వీక్‌గా అనిపించాయి. తోట తరణి ఆర్ట్ వర్క్ సినిమాకు ఎసెట్. నిర్మాతల ఖర్చు తెరపై కనిపించింది.

## పచ్చి మిర్చిని అసలు రోజుకు ఎన్ని తినవచ్చు..? దీన్ని తింటే ఎలాంటి లాభాలు ?

భారతదేశంలో చాలా మంది కారం ప్రియులు ఉంటారు. అధిక శాతం మంది కారంగా ఉండే వంటలను తినేందుకే ఇష్టపడుతుంటారు. అందుకనే భారతీయుల కూరలు చాలా కారంగా ఉంటాయి. ఇతర దేశీయులు మన వంటకాలను తినాలంటే అందుకనే భయపడతారు. అయితే ప్రస్తుతం కారం తినేవారు చాలా తగ్గిపోయారు. పిజ్జాలు, బర్గర్ల వంటి జంక్ ఫుడ్‌ను తింటూ అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు చిన్నతనంలోనూ కారం అధికంగా తినేవారు. కానీ ఇప్పుడు చిన్నారులు అసలు కారం తినడం మానేశారు. కారం తినడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రభావం పడుతుందని, అల్సర్లు వస్తాయని చాలా మందిలో ఒక నమ్మకం ఉంది. కనుకనే చాలా మంది కారం తినడం లేదు. అయితే ఇందులో కొంత మాట వాస్తవమే అయినా అల్సర్లు వచ్చేందుకు పూర్తిగా కారం తినడమే కారణం కాదు, ఇంకా అనేక కారణాలు కూడా ఉంటాయి.

## అల్లు అరవింద్‌ను వెంటాడిన మరో విషాదం..



హైదరాబాద్ :ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌ను మరో విషాదం వెంటాడింది. తన తల్లి మరణం మరువక ముందే.. అల్లు అరవింద్ చిన్ననాటి స్నేహితుడు నాగరాజు కన్నుమూశాడు. నాగరాజు స్నేహితుడే కాదు.. అరవింద్‌కు అత్యంత సన్నిహితుడు కూడా. అల్లు అరవింద్‌కు సంబంధించిన గీతా ఆర్ట్స్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నాగరాజు పని చేస్తున్నారు. నాగరాజు మృతి పట్ల అల్లు అరవింద్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు సంతాపం ప్రకటించారు. నాగరాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. గీతా ఆర్ట్స్ నిర్మించిన మాస్టర్ సినిమా నుంచి నాగరాజు గీతా ఆర్ట్స్ నిర్మించిన ఎన్నో సినిమాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. 76 ఏండ్ల వయసు కలిగిన నాగరాజుకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఆస్ట్రేలియాలో స్థిరపడ్డాడు.అల్లు అరవింద్ తల్లి అల్లు కనకరత్నమ్మ (94) కన్నుమూసిన సంగతి తెలిసిందే. వృద్ధాప్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆగస్టు 30వ తేదీన తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆ బాధ నుంచి కోలుకోక ముందే అత్యంత సన్నిహితుడు నాగరాజు మరణించడం.. అల్లు అరవింద్ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేసింది.

## 'లిటిల్ హార్ట్స్' మెప్పించిందా




'90 మిడిల్ క్లాస్ బయోపిక్' సిరీస్‌తో చక్కని విజయం అందుకున్నారు దర్శకుడు ఆదిత్యా హాసన్ ఇప్పుడు ఆయన నిర్మాతగా మారి సాయి మార్తండ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ తెరకెక్కించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. '90 మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేం మౌళి తనూజ్, 'అంబాజీ పేట మ్యారేజీ బ్యాండ్' ఫేం శివానీ నాగారం జంటగా నటించారు. రాజీవ్ కనకాల, అనితా చౌదరి, ఎస్ఎస్ కాంచీ, సత్య, నిఖిల్ అబ్బూరి, కృష్ణ ఇతర పాత్రధారులు. ఈ చిత్రాన్ని బన్నీవాసు, వంశీ నందిపాటి కలిసి థియేట్రికల్‌గా విడుదల చేశారు. ట్రైలర్, టీజర్ సినిమాకు మంచి బజ్ క్రియేట్ చేశాయి. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఎలా ఉందో చూద్దాం...సినిమా వెబ్ సిరీస్ కథ:

అఖిల్ (మౌళి) ఓ మాదిరిగా చదివే బ్యాక్‌బెంచ్ స్టూడెంట్. తన తండ్రి గోపాలరావు (రాజీవ్ కనకాల) కొడుకుతో బీటెక్ చేయించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చూడాలని కలలు కంటుంటాడు. ఎంసెట్ ర్యాంక్ రాకపోవడం పెట్టిన్లిన చివాట్లు పెట్టి ఎంసెట్ లాంగ్ టర్మ్ కోర్స్ చేయిస్తాడు. మరో పక్క డాక్టర్ కృష్ణారావు (ఎస్ఎస్ కాంచీ).. తన కూతురు కాత్యాయిని (శివానీ నాగారం) డాక్టర్‌ని చేయాలనే తపనతో నాలుగోసారి లాంగ్ టర్మ్ చేయిస్తాడు. అక్కడ అఖిల్‌కు కాత్యాయిని తారసపడుతుంది. తొలి చూపు నుంచే ఆమె ఫాల్ అవుతూ ఇంప్రెస్ చేసి ప్రేమలో దించాలనుకుంటాడు. అదే జరుగుతుంది కూడా. ఈలోపు ఇద్దరి మధ్య ట్విస్ట్. ఆ ట్విస్ట్ ఏంటి? జీవితంలో వీరిద్దరూ అనుకున్నది సాధించారా? వీరి ప్రేమ పెళ్లి దాకా వెళ్లిందా? ఇరు కుటుంబాల తల్లిదండ్రులు ఏం చేశారు ఇది సింపుల్‌గా ఈ సినిమా కథ.

2015 సమయంలో సాగే కథ ఇది. ఇంట్లో సరిగా చదవని టీనేజర్స్ ఉంటే వారి పరిస్థితి ఎలా ఉంటుంది? పిల్లల విషయంలో కోరుకునే తల్లిదండ్రుల ఆలోచనలు, నియమ నిబంధనలు ఎలా ఉంటాయి అన్న కథకు రొమాంటిక్ లవ్‌స్టోరీ, వినోదాన్ని జోడించి తీసిన సినిమా ఇది. ఇందులో పెద్ద కథేమీ లేదు. అందరికీ తెలిసిన కథే. ఫస్టాఫ్ అంతా ఎంసెట్ ఎగ్జామ్, లాంగ్ టర్మ్ ఇన్‌స్టిట్యూట్, కొత్త పరిచయాలు, స్నేహితుల మధ్య సరదా సన్నివేశాలతో సోసోగా సాగిపోయింది. అమ్మాయితో పరిచయం, ప్రేమను ఎక్స్‌ప్రెస్ చేసే సమయానికి హీరోహీరోయిన్‌కి మధ్య ఓ ట్విస్ట్. అక్కడితో ఇంటర్వెల్ ఇచ్చి కథపై మరింత ఆసక్తి కలిగించాడు దర్శకుడు. (ఆ ట్విస్ట్ ఏంటనేది తెరపైనే చూడాలి). అక్కడి నుంచి కథ పరుగులు తీస్తుంది. కథలో ఎంటర్‌టైన్‌మెంట్ అంతా సందర్భానుసారంగా సాగుతుంది. ఎక్కడా బోర్ కొట్టదు. ప్రేమకథ, కామెడీ, సెటైర్లు అన్ని అద్భుతంగా నవ్వులు పూయిస్తూనే ఉంటాయి. ఇందులో మౌళి చేసిన మ్యూజిక్ వీడియో భలే ఫన్ క్రియేట్ చేసింది. కాలం, పరిస్థితులతో టీనేజర్స్ ఆలోచనల్లో ఎలాంటి మార్పులు వస్తాయి? బలవంతపు చదువులు కాకుండా నచ్చింది చేస్తే ఆ కిక్ ఎలా ఉంటుంది అన్నది కూడా ఇందులో చూపిస్తూ చిన్న సందేశం ఇచ్చారు. తెలిసిన కథో సినిమా అనుకున్నప్పుడు తెరకెక్కించే విధానం, ప్రేక్షకుడిని ఎంగేజ్ చేయడా నికి తగిన జాగ్రత తీసుకోవాలి. ఆ విషయంలో దర్శకుడు సాయి మార్తండ్ ఫర్‌ఫెక్ట్‌గా వర్క్ చేశాడు. తను ఏం చెప్పాలనుకున్నాడో అదే తెరపై చూపించాడు. క్లైమాక్స్‌ను అటు ఇటు చేయకుండా ఓ ఫ్లోలో జాగ్రత్తగా ట్రీట్ చేశాడు.

### నటీనటులు సాంకేతిక నిపుణులు పనితీరు...

అఖిల్ పాత్రలో మౌళి ఇరగదీశాడనే చెప్పాలి. ఆ పాత్రకు అతని సెలెక్షన్ పర్ఫెక్ట్ అనిపించింది. డైలాగ్ డెలివరీ, కామెడీ టైమింగ్, సెటైర్లు అంతా కరెక్ట్‌గా కుదిరాయి నటన పరంగానూ వందకు వంద మార్కులు వేయవచ్చు. హీరోయిన్ శివానీ నాగరం కూడా పర్ఫెక్ట్ యాప్ట్ అనే చెప్పాలి. కాత్యాయిని పాత్రకు పూర్తి న్యాయం చేసింది. తెరపై ఎంతో చలాకీగా కనిపించింది. మౌళి స్నేహితులుగా నటించిన సాయి(మధు), మిర్చి వైల్డ్ ఆర్టిస్ట్ నిఖిల్ అబ్బూరికి మంచి పాత్రలు దక్కాయి. సాయి కామెడీ టైమింగ్ బావుంది. మరో వైల్డ్ ఆర్టిస్ట్ రాజా ప్రజ్వల్ కూడా బాగా చేశాడు. ఈ మధ్యకాలంలో ఏ ఓటీటీ సిరీస్ చూసిన రాజీవ్ కనకాల పక్కాగా ఉంటున్నారు. ఇందులో గోపాలరావుగా చక్కని నటన కనబర్చారు. అలాగే ఎస్ఎస్ కాంచీ కూడా తన పాత్రకు న్యాయం చేశారు. అనితా చౌదరి, సత్యకృష్ణన్ పరిధి మేరకు నటించారు. దర్శకుడి రాత, తీత కూడా బావుంది. మాటలు ఆకట్టుకున్నాయి.

# టీమిండియాకు సరికొత్త జెర్సీ..

### ఆసియా కప్‌లో ఆటగాళ్లు ధరించే జెర్సీలు చూశారా?

మరో రెండ్రోజుల్లో దుబాయ్ వేదికగా ఆసియా కప్-2025 ప్రారంభం కాబోతోంది. పూర్తిగా టీ-20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీలో ఆసియా ఖండానికి సంబంధించిన జట్లు పాల్గొనబోతున్నాయి. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా ఇప్పటికే దుబాయ్‌లో ల్యాండ్ అయ్యి ప్రాక్టీస్ ప్రారంభించింది. మరో రెండ్రోజుల్లో దుబాయ్ వేదికగా ఆసియా కప్-2025 ప్రారంభం కాబోతోంది. పూర్తిగా టీ-20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీలో ఆసియా ఖండానికి సంబంధించిన జట్లు పాల్గొనబోతున్నాయి. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా ఇప్పటికే దుబాయ్‌లో ల్యాండ్ అయ్యి ప్రాక్టీస్ ప్రారంభించింది. ఈ టోర్నీలో టీమిండియా తన మొదటి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10వ తేదీన ఆడబోతోంది. ఈ టోర్నీలో టీమిండియా కొత్త జెర్సీతో బరిలోకి దిగబోతోంది

ఇప్పటివరకు టీమిండియాకు డ్రీమ్ 11 మధ్య స్పాన్సర్ చేసేది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ డీల్ ఇటీవల రద్దు అయింది (%ణతీమ్ఖఎ11 శ్రీశీస్త్రశీ తీవఎశీజవంు%). దీంతో బీసీసీఐ కొత్త స్పాన్సర్‌షిప్ కోసం టెండర్లను కూడా పిలిచింది. అయితే ఆసియా కప్ సమయానికి స్పాన్సర్‌షిప్ వ్యవహారం తేలలేదు.



దీంతో ఎటువంటి స్పాన్సర్‌షిప్ లేకుండానే ఆసియా కప్‌లో టీమిండియా ఆడుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియా కొత్త జెర్సీపై ఎలాంటి లోగో ఉండబోవడం లేదు. కొత్త జెర్సీతో టీమిండియా ఆటగాళ్లు ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి

టీమిండియా కొత్త జెర్సీ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కొత్త జెర్సీపై స్పాన్సర్ పేరు లేదు. జెర్సీ ఎడమ వైపున బీసీసీఐ లోగో మాత్రమే ఉంది. కాగా, సెప్టెంబర్ 10వ తేదీన జరిగే తొలి మ్యాచ్‌లో యూఏఈతో భారత్ తొలి మ్యాచ్ ఆడబోతోంది. అలాగే సెప్టెంబర్ 14వ తేదీన పాకిస్థాన్‌తో ఆడుతుంది. ఇక, 19వ తేదీన ఒమన్ జట్టుతో తలపడనుంది.

# ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ వీరోచిత విజయం..

బిహార్ రాజగిర్‌లో జరిగిన ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత్ మరోసారి సత్తా చాటింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాపై భారత్ 4-1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి, నాలుగో టైటిల్ దక్కించుకుంది. ఈ గెలుపుతో భారత్‌కు 8 ఏళ్ల తర్వాత ఆసియా కప్ మళ్లీ దక్కింది.

ఈ విజయంతో భారత జట్టు రాబోయే 2026 హాకీ వరల్డ్‌కప్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ ప్రారంభమైన తొలి నిమిషానికే సుఖజీత్ సింగ్ ఫీల్డ్ గోల్ చేసి దక్షిణ కొరియాపై భారత ఆధిక్యానికి బీజం వేశాడు. ఆ తర్వాత భారత్ ఆత్మవిశ్వాసంతో మ్యాచ్ కొనసాగించి విజయం సాధించింది.

#### దిల్‌ప్రీత్ సింగ్ డబుల్..

ఈ మ్యాచ్‌లో అసలైన హీరోగా నిలిచాడు దిల్‌ప్రీత్ సింగ్. రెండో క్వార్టర్‌లో ఒక గోల్, మూడో క్వార్టర్‌లో మరో గోల్ చేసి తనదైన శైలిలో మ్యాచ్‌ను డామినేట్ చేశాడు. అతని వేగం, కూల్ ఫినిషింగ్ అభిమానులను ఆకట్టుకుంది. ఇలా రెండు గోల్స్‌తో దిల్‌ప్రీత్ భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

దక్షిణ కొరియా గోల్స్ కోసం పలుమార్లు ప్రయత్నించినా, భారత గోల్‌కీపర్ అద్భుతమైన సేవ్‌లు చేసి ప్రతి ప్రయత్నాన్ని



విఫలం చేశాడు. ఆ క్రమంలో భారత డిఫెన్స్ కొరియా దాడులను సమర్థంగా అడ్డుకుంది. చివరికి ఒక్క గోల్‌కే పరిమితమైన దక్షిణ కొరియా అనేక సార్లు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది.

# ఐపీఓల బాట పడుతున్న కంపెనీలు..
# నిధుల సమీకరణే ప్రధాన లక్ష్యం




ఇటీవల కాలంలో చాలా భారత కంపెనీలు తమ వ్యాపార విస్తరణ చేపట్టాలని కోరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణకు ఐపీఓ (ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్) మాత్రమే మంచి నిర్ణయమని భావిస్తున్నారు. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు సెబీ (ఎస్ఈబీఐ)కు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఓ బాట పట్టే కంపెనీల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. ఇటీవల ఐపీఓలకు వెళ్లే కంపెనీల సంఖ్య కొద్దిగా మందగించింది. ఈ నేపథ్యంలో ఆరు సంస్థలు రూ. 20,000 కోట్ల వరకు సమీకరించడానికి అనుమతించిన తర్వాత ఐపీఓ మార్కెట్‌కు మార్కెట్ నియంత్రణ సంస్థ నుంచి బూస్టర్ డోస్ లభించింది. ఇందులో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ (రూ. 12,500 కోట్లు), డోర్ఫ్ కేటల్ కెమ్స్ (రూ. 5,000 కోట్లు), విక్రమ్ సోలార్ (రూ. 1,500 కోట్లు)తో పాటు మరో మూడు కంపెనీలు ఉన్నాయి. ఈ అనుమతులతో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) నుంచి అనుమతి పొందిన 72 కంపెనీల ఐపీఓల నిధుల సమీకరణ రూ. 1.4 లక్షల కోట్లకు చేరుకుందని ఇటీవల వెల్లడైన డేటా ప్రకారం తెలుస్తోంది. అలాగే మరో 68 కంపెనీలు రూ. 95,000 కోట్ల వరకు సేకరించడానికి సెబీ ఆమోదం కోసం వేచి ఉన్నాయి. మొత్తం మీద 140 సంస్థలు రూ. 2.35 లక్షల కోట్ల వరకు సేకరించవచ్చు. మార్చి, ఏప్రిల్ నెలల్లో కొంత ప్రశాంతత కనిపించిన తర్వాత మే నెలలో %ఖూా% కార్యకలాపాలు కొంత ఊపందుకున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. దీనివల్ల కంపెనీలు మరిన్ని ఇష్యూలతో ముందుకు రావడానికి విశ్వాసం కలిగిందని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల జాబితాలో కొన్ని ప్రముఖ కంపెనీలు ఉండడం విశేషం. ఏథర్ ఎనర్జీ, ఏజిస్ వోపాక్ టెర్మినల్స్, స్కాన్ బెంగళూరు, స్కోడా ట్యూబ్స్ వంటి కంపెనీలు ఇష్యూ సైజులను 15-30 శాతం తగ్గించుకున్నాయి. అయితే ఆయా కంపెనీ లిస్టింగ్ లాభాలు కూడా అద్భుతంగా లేవు. ఉదాహరణకు ఏథర్ ఎనర్జీ లిస్టింగ్‌లో 2.18 శాతం ఎక్కువగా లిస్టింగ్ చేయగా, ఏజిస్ వోపాక్, స్కాన్ బెంగళూరు రెండూ 6 శాతం తగ్గింపుతో లిస్టింగ్ చేశాయి. స్కోడా ట్యూబ్స్ ఫ్లాట్‌గా లిస్టింగ్ చేసింది. అలాగే వీటి పనితీరు 2025 ఆర్థిక సంవత్సరంలో లో కనిపించిన 30 శాతం బేసి లిస్టింగ్ లాభాలకు చాలా దూరంగా ఉంది. మార్కెట్‌ను స్థిరీకరించడంతో పాటు దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల నుంచి వచ్చే పెట్టుబడులను గ్రహించడంలో ఐపీఓ సరఫరా ముఖ్యమైన పాత్ర పోషించిందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో పేలవమైన పనితీరును దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌కు ఏదో ఒక రకమైన ఉత్ప్రేరకం అవసరమని వివరిస్తున్నారు. ముఖ్యంగా పెట్టుబడిదారులలో పెట్టుబడులపై ఉత్సాహం కొరవడిందని, చాలా ఐపీఓల్లో పెట్టుబడి కూడా లివరేజ్ ద్వారా జరుగుతుంది కాబట్టి ఖర్చు ప్రయోజనం పెట్టుబడిదారుడిలోనే ఉండాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609